హైదరాబాద్
ఆదివారం
20-1-2019
సంపుటి: 3, సంచిక: 21
పేజీలు: 8+8, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



21 నుంచి మహారుద్ర సహిత సహస్ర చండీయాగం

బంగారు తెలంగాణ అభివృద్ధి, ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యంగా యాగం

- ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్న కేసీఆర్
- 250 మంది రుత్విక్కుల నేతృత్వంలో 5 రోజుల పాటు యజ్ఞం
- శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి ఆశీస్సులతో కొనసాగనుంది
- యాగాలు నిర్వహించడంలో దేశంలోనే కేసీఆర్‌కు సాటిలేదు
- 1996లో సహస్ర లక్ష్మీ సూక్త సహిత అభిషేకం..
- 2015 డిసెంబర్ 23న ఆయుత శతచండీయాగం...

3



పరమేశ్వరన్‌కు కీలక పదవి

ట్రంప్ యంత్రాంగంలో భారతీయుడికి చోటు

5

అభివృద్ధిలో ఆదర్శం తెలంగాణ

సంక్షేమంలో సర్దార్.. సమస్యల పరిష్కారంలో జోర్దార్



- పథకాల అమల్లో తెలంగాణ బాట పడుతున్న ఇతర రాష్ట్రాలు
- తెలంగాణ పథకాలు, అన్నివర్గాల ప్రజలకు చెరువయ్యాయ్
- కొత్త రాష్ట్రమైనా నెంబర్‌వన్ స్థానంలో దూసుకుపోతోంది
- అందుకే టీఆర్‌ఎస్‌కు ప్రజలకు పట్టం కట్టారని వెల్లడి
- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, జనవరి 19, (మనం ప్రతినిధి):

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న తెలంగాణ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా పేరుపొందింద'ని రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే రెండు కండ్లుగా సాగుతున్నందునే ప్రజలు రెండో సారి టీఆర్‌ఎస్‌కు పట్టం కట్టారని ఆయన అన్నారు. కొత్తగా ఏర్పాటైన అసెంబ్లీ ఉభయసభలను ద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన శాసన సభ్యులందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు. మీ పదవీ కాలం దిగ్విజ యంగా సాగాలని, మీరంతా అంకితభావంతో ప్రజాసేవలో నిమగ్నం కావాలని మన సారా అకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం కొలువుదీరిన ఈ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్నందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం సాధించుకోగలి గారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ముందుండి నడిపించిన కల్వ కుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తొలి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన జీవన విధ్వంసాన్ని, ఇతర నష్టాలను పరిగణనలోకి తీసుకుని, ఆనా టి పరిస్థితుల్లో అవలంభించవలసిన పంథాను నిర్దేశించుకుని ప్రభుత్వం తన ప్రయా ణాన్ని ప్రారంభించిందని ఆయన చెప్పారు. అన్ని రంగాల్లో మిగతా 2లో..



పక్షుల పండుగ వచ్చిందోచ్!

నేటి నుంచి నేలపట్టులో ఫ్లెమింగో ఫెస్టివల్

- మూడు రోజుల పాటు సంబరాలు
- నాలుగు నెలలు ఉండే విదేశీ పక్షులు

దొరవారిసత్రం జనవరి 19 (మనం న్యూస్):

పొడవాటి కాళ్లు.. చిన్న శరీరం.. రెక్కలపై అక్కడక్కడ ఎరుపు రంగు, ఆపైన పొడవైన మెడ.. ఇలాంటి పక్షులను ఫ్లెమింగోలు అంటారు. ఇవి మన దేశంలో కనిపించడం అరుదు. కానీ, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట పరిసర ప్రాంతా లకు ఈ విదేశీ అతిథులు వచ్చి ..మిగతా 2లో



ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి శుక్లపక్షం చతుర్దశి ప.1.52 వరకు; తదుపరి: పౌర్ణమి; నక్షత్రం: ఆరుద్ర ఉ.7.39 వరకు; తదుపరి: పునర్వసు; వర్జ్యం: రా.6.56 నుంచి 8.25 వరకు; దుర్ముహూర్తం: సా.4.13 నుంచి 5.00 వరకు; రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; యమగండం: ప.12.00 నుంచి 1.30 వరకు; అమృతఘడియలు: తె.3.56 నుంచి 5.23 వరకు (తెల్లవారితే సోమవారం);

వాతావరణం



ఆదివారం తెలంగాణలో వాతావరణం పొడిగా, కాస్త వేడిగా ఉండే అవకాశం ఉంది. చలిగాలుల తీవ్రత కొంత తగ్గుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలి వేగం: గంటకు 13కి.మీ.



యువత కృషితోనే సమస్యలు పరార్

కలిసికట్టుగా పోరాటం చేస్తేనే పరిష్కారమవుతాయ్

- అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో కవిత
- అతిథులుగా అన్నా హజారే, అర్జున్ బహదూర్ థాపా
- మలావత్ పూర్ణకు జాగృతి యూత్ అచీవర్ అవార్డు
- ఎనమండుగురికి ఇండియా యూత్ ఫెలో షిప్
- యువత అద్భుతాలు సృష్టించాలె..
- ఈ నెల 30 నుంచి నిరాహారదీక్ష: అన్నా హాజారే

2

మారుతున్న పాఠం

టెక్నాలజీ ఆధారంగా విద్యాబోధన

మనం సండే స్పెషల్

- ప్రశ్నలు.. సమాధానాలకు టాటా
- ట్యాబ్‌లో పిల్లలకు వర్చువల్ గేమ్స్
- అందులో పాయింట్లతో ఉపయోగం
- రాపిడ్ ఫైర్ ప్రశ్నలతో పాయింట్లు
- పరస్పర సహకారానికి ప్రాధాన్యం
- పిల్లలకు అలవడిన సంఘ జీవనం
- రాష్ట్ర స్థాయిలో మెరుగుపడ్డ ప్రతిభ

2



ప్రమాదంలో సర్కారు

ఇప్పటికీ ప్రభుత్వానికి ముప్పుంది



- బీజేపీ యత్నాలు ఫలించకపోవచ్చు
- కాషాయ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది
- ఆ నలుగురికి.. కాంగ్రెస్‌పై అసంతృప్తి
- నేనంటే మాత్రం వాళ్లందరికీ గౌరవమే
- జర్కిహోలి సహా అంతా తిరిగొస్తారు..
- కర్ణాటక సీఎం కుమారస్వామి ధీమా

కోల్‌కతా, జనవరి 19:

తమ ప్రభుత్వం ఇప్పటికీ ప్రమాదంలోనే ఉందని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో బీజేపీ విజయవంతం కాదన్న ధీమా తనకుందని అన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఉందని, బీజేపీ తమ ప్రభుత్వాన్ని ప్రమాదంలో ..మిగతా 2లో



ఎక్స్‌పైరీ డేట్ అయిపోయింది

ఇక బీజేపీ సర్కారు దిగిపోవాల్సిందే

- ప్రధాని అభ్యర్థి ఎవరో ముఖ్యంకాదు
- ముందు బీజేపీని ఓడించడమే లక్ష్యం
- దేశాన్ని దోచుకుని.. ఆ పార్టీ వెనకడుగు
- వాళ్లు చెప్పిన అచ్ఛే దిన్ రానే రాలేదు
- కోల్‌కతా ర్యాలీలో బెంగాల్ సీఎం మమత
- ఉన్న ఉద్యోగాలూ పోయాయి: ఖర్గే
- సమాజాన్ని బీజేపీ చీల్చింది: కేజ్రీవాల్
- బీజేపీ కూటమిలో ఈడీ, సీబీఐ: అఖిలేశ్
- బెంగాల్ పులి గర్జించింది: అరుణ్ శౌరి

5

అవినీతిపరులపైనే చర్యలు



5 లో..

- ప్రజాధనం దోచుకోకుండా అడ్డుకున్నా
- వాళ్లంతా కలసి మహాకూటమి కట్టారు
- బీజేపీకి కాదు ప్రజలకే ఇది వ్యతిరేకం
- అభివృద్ధికి, అవినీతికి మధ్య పోటీ: మోదీ

ఇదీలోకం!



ర్యాలీకి వచ్చిన వారి కన్నా.. మీరు రాని వాళ్లిద్దరి గురించే ఎక్కువ ఆలోచిస్తున్నారు సార్!

మారుతున్న పాఠం

(మనం సెంట్రల్ డెస్క్)

మనం సండే స్పెషల్

అది.. మిట్టమధ్యాహ్నం ఒంటిగంట సమయం. అమెరికాలోని కనెక్టికట్ నగరం. స్కూల్లోని ఓ క్లాసులో దాదాపు 20 మంది పిల్లలు సీరియస్‌గా ట్యాబ్ స్క్రీన్‌వైపు చూస్తున్నారు. వాళ్లంతా ఒకరి వెంట ఒకరుగా చాలెంజిలు స్వీకరిస్తూ, వాటిని ఛేదిస్తూ వర్చువల్ డబ్బులు సంపాదిస్తున్నారు. దాంతో ఆ సైట్‌లోనే ఉన్న వర్చువల్ పెంపుడు జంతువులు, దుస్తులు.. ఇలాంటివన్నీ కొంటున్నారు.

ఇదేంటి, క్లాసులో పాఠాలు వినాలి గానీ ఇలా ఆటలు ఆడుకుంటారా? టీచర్ ఏం చేస్తున్నారని అనుమానం వచ్చిందా? పిల్లల ప్రవర్తన మార్చడానికి వీలుగా కొన్ని యాప్‌లు, గేమ్స్ లాంటివాటిని అక్కడి టీచర్లు ప్రోత్సహిస్తున్నారు. అందరూ ఒకరికి ఒకరు సాయం చేసుకోవడం, సత్ప్రవర్తన, పెంపుడు జంతువులను సంరక్షించడం లాంటి అలవాట్లు ఇప్పటినుంచి నేర్పుతున్నారు. అందుకోసం మామూలుగా నీతిపాఠాలు చెబుతుంటే పిల్లల బుర్రలకు సరిగా ఎక్కడం లేదు. దాంతో కొన్ని యాప్‌లు, వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్ ఉపయోగించి వీడియో గేమ్‌లలో ఉండే పాత్రలను తీసుకుని సరికొత్త గేమ్స్ వాళ్లే డిజైన్ చేస్తున్నారు. ఇదంతా తమకు బాగా నచ్చిందని, తనకు కుక్కలను పెంచుకోవాలని సరదా ఉంది గానీ, తమ ఇంట్లో సాధ్యం కాదని.. ఇప్పుడు ఇక్కడ మంచి కుక్కపిల్లను కొనుక్కోడానికి చాలెంజ్‌లు ఛేదించి డబ్బులు సంపాదించానని, ఆ కుక్కపిల్లకు కావల్సిన దుస్తులు, కళ్లజోడు, సబ్బు.. అన్నీ కొన్నానని 13 ఏళ్ల రోజ్ చెప్పింది. ఆ కుక్కపిల్లకు శిక్షణ ఇవ్వడం కోసం చాలెంజ్‌లు ఒక్కోదాన్నీ ఛేదిస్తూ ఉంటే



బంగారం వస్తుందని, దాంతో ఒక్కోటీ కొనుక్కోవచ్చని కూడా ఆమె వివరించింది. అందులో ఆమె కొంతమంది ఇతర స్నేహితురాళ్ల సాయం కూడా అడిగి తీసుకుంది. వాళ్లంతా కూడా ఆమెకు ఆ పనిలో సాయపడ్డారు. ఇలా ఒకరికి ఒకరు సాయం చేసుకోవడం అనే పద్ధతి ఇంతకుముందు ఆ క్లాసు పిల్లల మధ్య ఉండేది కాదట. ఎవరికి వాళ్లు తమ పని చేసుకోవడం, ఎవరి పాఠాలు వాళ్లు చదువుకోవడంతోనే సరిపెట్టేసేవారు. దాంతో సంఘజీవనం అనేది పిల్లలకు అస్సలు అలవాటు పడటం లేదని గుర్తించిన పాఠశాల యాజమాన్యం.. ఈ తరహా గేమ్‌లను అలవాటు చేసింది. పిల్లలకు కేవలం పుస్తకాల్లో పాఠాలు మాత్రమే కాకుండా, జీవిత పాఠాలు కూడా నేర్పించాలన్న విషయాన్ని గుర్తించింది. ఈ గేమ్‌లు ఆడేటపుడు కేవలం వినోదం మాత్రమే కాక వారిలో విజ్ఞానం ఎంత వస్తోందన్న విషయాన్ని కూడా టీచర్లు అత్యంత జాగ్రత్తగా గమనిస్తుంటారు. తన క్లాసు పిల్లలకు ఒకరికి ఒకరు సాయపడటం, అవసరమైతే సాయం కోరడం లాంటివి ముందుగా అలవాటు చేశానని, దానివల్ల ఒకే ప్రాంతంలో ఉండే పిల్లలంతా ఇప్పుడు కలిసి వెళ్లడం, కలిసి రావడం లాంటివి చూస్తున్నానని క్లాస్ టీచర్ స్టెఫానీ తెలిపారు. ఇంతకుముందు ఎవరికి వారు తమ తల్లిదండ్రులతోనే వచ్చి, వెళ్లేవారని.. ఇప్పుడు ఇక వారి అవసరం లేకుండా పిల్లలే అంతా కలిసి వెళ్లి కలిసి రావడంతో ఒకరి మధ్య ఒకరికి సంబంధ బాంధవ్యాలు పెరుగుతున్నాయని ఆమె వివరించారు. ఎప్పుడూ పాఠాలు మాత్రమే చెబుతూ, వాటిని బట్టీ పట్టించి వాటిలోనే పరీక్షలు పెడుతుంటే పుస్తకాల పురుగులుగా మిగిలిపోతూ సంఘజీవనం అంటే ఏంటో తెలియకుండా పోతోందని.. అందుకే వాళ్లకు పాఠాలు చెబుతూనే అదే సమయంలో వినోదం కూడా జతచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని స్టెఫానీ అన్నారు. 2017లో తాను క్లాస్‌క్రాఫ్ట్ అనే యాప్‌ను ఉపయోగించడం మొదలుపెట్టానని, అప్పటినుంచి పిల్లలు మరింత స్ఫూర్తి పొంది, తరగతి గదుల్లో వాళ్ల పనితీరు కూడా మెరుగుపడిందని వివరించారు. దాంతో ఆ తర్వాతి నుంచి మరిన్ని క్యారెక్టర్లను ప్రవేశపెట్టి, వాటి సాయంతోనే పాఠాలు కూడా చెబుతున్నానన్నారు.

న్యూయార్క్ నగరంలోని క్వెస్ట్ టు లెర్న్ అనే పాఠశాలలో తొలిసారిగా పూర్తిస్థాయి గేమ్స్ ఆధారిత పాఠాలు మొదలుపెట్టారు. ఇందుకోసం కొంతమంది గేమ్ థియరిస్టులను కూడా వాళ్లు నియమించుకున్నారు. వాళ్లు పిల్లల మనస్తత్వాన్ని సన్నిహితంగా పరిశీలించి, వాళ్లకు ఎలాంటి గేమ్‌లు కావాలో తెలుసుకుని, వాటి గురించి మళ్లీ ఉపాధ్యాయులతో చర్చించి అప్పుడు రూపొందించారు. అవి పిల్లల అవసరాలకు సరిగ్గా సరిపోయాయి. పిల్లలను రాపిడ్‌ఫైర్ తరహాలో ప్రశ్నలు అడగడం, వాటిలో సరైన సమాధానం చెప్పిన పిల్లలకు పాయింట్లు ఇవ్వడం, ఆ పాయింట్లతో క్లాసులో పాటలు వినే అవకాశం కల్పించడం లాంటి ఇంటరాక్టివ్ బోధన విధానాలను అవలంబించారు. కనీసం 50 పాయింట్లు సాధించిన వారికి హెడ్ ఫోన్లు ఇచ్చి, వాటిలో వారికి నచ్చిన పాట వినే అవకాశం కల్పించారు. అలాగే 100 పాయింట్లు సంపాదిస్తే గేమ్‌లో వాళ్ల రూపాన్ని (అవతార్) అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. అంటే, కావల్సిన రూపంలోకి మారిపోవచ్చు. అదంతా జరగాలంటే పాయింట్లు రావాలి. పాయింట్లు రావాలంటే పాఠంలో ప్రతి అంశం పూర్తిగా నేర్చుకోవాలి తప్ప ప్రశ్నలకు సమాధానాలు రాయడం అనేది ఉండదు. ఇలా సాంకేతికతను జోడించడం ద్వారా పిల్లలలో సృజనాత్మక ఆలోచనలను కూడా పెంచగలిగారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఇంగ్లీషు పరీక్షలలో క్వెస్ట్ టు లెర్న్ విద్యార్థులలో 43% మంది రాష్ట్రస్థాయి ప్రమాణాల కంటే ఎక్కువగా ఉన్నారు. 41% మంది నగర స్థాయిలో ఉన్నారు. 29% మంది విద్యార్థులు లెక్కల్లో రాష్ట్రస్థాయిని అందుకోగా, 33% మంది నగరస్థాయిని అందుకున్నారు.

స్మార్ట్ క్లాస్..

మన దేశంలో కూడా చాలా పాఠశాలల్లో స్మార్ట్‌క్లాసులు అంటూ ప్రత్యేకంగా దృశ్య శ్రవణ విద్యావిధానాన్ని అవలంబిస్తున్నారు. కానీ ఇందులో పుస్తకాల్లో ఉన్న పాఠాలనే తీసుకుని వాటికి దృశ్యాలు జోడించి చెబుతుంటారు. దానివల్ల అందులో కూడా తరగతి పాఠాలే వస్తాయి తప్ప.. ఇలాంటి పోటీతత్వం, పరస్పర సహకారం లాంటివి ఉండవు. పాఠాలు చెప్పడం, వాటిలో ప్రశ్నలకు సమాధానాలు రాయించడం కాకుండా.. సృజనాత్మక పద్ధతులతో బోధిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యావేత్తలు ఎప్పటినుంచో చెబుతున్నారు.

వీడియోలతో ఇబ్బందా?

అయితే ఇలా వీడియోలు, పాటలు పెట్టడం వల్ల.. విద్యార్థులకు గాడ్జెట్ల మీద మోజు పెంచినట్లు ఏమైనా అవుతుందా అనే అనుమానాలు సైతం మొదట్లో వచ్చాయి. కానీ ఇక్కడ పిల్లలకు విడివిడిగా ట్యాబ్‌లు ఇవ్వకుండా, నలుగురైదుగురికి కలిపి ఒక్కోటి ఇవ్వడం ద్వారా పంచుకోవడం అనే పద్ధతిని వారికి అలవాటు చేశారు. నేర్చుకోవడం ఎలా అని వాళ్లంతట వాళ్లే తెలుసుకోవడంతో పాటు.. అలా తాము నేర్చుకున్నవాటిని పక్కవారికి నేర్పడం కూడా అలవాటైందని, దాంతో సామాజిక విలువలు పెరిగాయని ప్రముఖ విద్యా పరిశోధకుడు క్రిస్టోఫర్ డెవర్స్ తెలిపారు. పిల్లలు చాలా విషయాలు నేర్చుకుంటున్నారని, కానీ దాన్ని వాళ్లు ఆట అనుకుంటున్నారని హీథర్ డాల్టన్ అనే ఉపాధ్యాయిని వివరించారు.

ప్రమాదంలో సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

నెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందని కోల్‌కతాలో మమతా బెనర్జీ నేతృత్వంలో నిర్వహించిన ప్రతిపక్షాల ర్యాలీకి వచ్చిన సందర్భంగా జాతీయ మీడియాతో ఆయన వ్యాఖ్యానించారు. రమేశ్ జర్కిహోళి, బి. నాగేంద్ర, ఉమేశ్ జాదవ్, మహేశ్ కుమటహళ్లి.. ఈ నలుగురు ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నా ప్రభుత్వం నిలబడుతుందని ఎలా చెబుతున్నారని ప్రశ్నించగా, బెలగాం రాజకీయాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ నాయకత్వంతోనే అంతర్గత గొడవలున్నాయని కుమారస్వామి చెప్పారు. రమేశ్ జర్కిహోలిపై కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తితో ఉందని, బెలగాం రాజకీయాల్లో అంతర్గతంగా కాంగ్రెస్-బీజేపీ నేతల మధ్య సంబంధాలు బాగానే ఉంటాయని అన్నారు. తాము ఆ బంధాన్ని విడగొట్టామని, ఆ నలుగురు ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ నాయకత్వంతో సమస్యలు ఉండచ్చు గానీ, తనతో అందరూ బాగున్నారని తెలిపారు.

పక్షుల పండుగ వచ్చిందోచ్!

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు నెలల పాటు ఇక్కడే ఉండి, తమ సంతతి పెంచుకుని మరీ స్వదేశాలకు వెళ్తుంటాయి. ఒక్క ఫ్లెమింగోలే కాక.. కొన్ని వేల రకాల పక్షులు ఈ సీజన్‌లో పులికాట్ సరస్సు వద్దకు చేరుకుని, ఆ సరస్సులో ఉండే చేపలు.. ఇతరత్రా వాటిని తింటూ నాలుగు నెలలు సేద తీరి, ఆ తర్వాత తమ సొంతిళ్లకు వెళ్తుంటాయి. ఇలా ఎక్కడెక్కడో కొన్ని వందలు, వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి మరీ వచ్చే అందమైన, అరుదైన అతిథులను సాదరంగా స్వాగతించి.. తద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధిచేయడానికి ప్రభుత్వం ప్రతియేటా ఫ్లెమింగో ఫెస్టివల్ పేరుతో ఉత్సవాలు చేస్తుంది. ఈ సంవత్సరం కూడా ఆదివారం మొదలు మంగళవారం వరకు మూడు రోజుల పాటు.. అంటే 20 నుంచి 22వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సూళ్లూరుపేట, నేలపట్టు తదితర ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేశారు.

యువత కృషితోనే సమస్యలు పరార్

హైదరాబాద్, జనవరి 19, (మనం ప్రతినిధి): యువత కలిసికట్టుగా కృషి చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్యర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు రెండో రోజు సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండో రోజున భారీ అతిరథ మహామహుల నడుమ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును ప్రముఖ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అన్నా హజారేతో కలిసి జాగృతి అధ్యక్షురాలు కవిత కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇక, ఈ సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరయ్యారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు అనే అంశంపై సదస్సు జరిగింది. హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో జరుగుతున్న సదస్సు ఆదివారం కూడా కొనసాగనుంది. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణల బావనతో సదస్సు నిర్వహణ. శనివారం ప్రారంభ సమావేశానికి అన్నా హజారే, సార్క్ మాజీ ప్రధాన కార్యదర్శి అర్జున్ బహదూర్ థాపా ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు, 40 మంది వివిధ రంగాల ప్రముఖులు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు.

సుస్థిర అభివృద్ధికి పని చేయాలి : ఎంపీ కవిత

ప్రపంచంలో ఉన్న సమస్యలన్నీ మనకు మనం సష్టించుకున్నవే అని ఎంపీ కవిత తెలిపారు. ప్రపంచంలో ఏటా 22 వేల మంది చిన్నారులు చనిపోతున్నారు. సుస్థిర అభివద్ధికి ఉత్సాహంగా పని చేయాల్సిన అవసరం ఉంది. మన వల్ల ఉద్భవించిన కొన్ని సమస్యలకైనా ఈ సదస్సులో పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నాను. యువత కలిసికట్టుగా పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి అని కవిత పేర్కొన్నారు.

యువత మరిన్ని అద్భుతాలు సృష్టించాలే : అన్నాహజారే

మూడు రోజుల పాటు హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అన్నా హజారే మాట్లాడుతూ.. ఏడాది, ఐదేళ్లు, పదేళ్లు ప్రాతిపదికగా లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆయన సూచించారు. యువశక్తి సరికొత్త దిశగా ప్రయాణించి అద్భుతాలు సృష్టించాలని చెప్పారు. జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలపై ముందే స్పష్టత ఉండాలన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించింది. పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చింది. జఠిలంగా మారిన విద్యుత్తు సంక్షోభం పరిష్కరించే చర్యలు చేపట్టిందన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించడం కోసం ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించింది. పరిశ్రమలు, ఐటి రంగ విస్తరణ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు ప్రారంభించిందన్నారు. కూలిన కులవృత్తులను నిలబెట్టి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసింది. వ్యవసాయం దండుగ అని నిరాశానిస్పృహలలో కూరుకుపోయిన రైతాంగానికి ధైర్యం, స్థైర్యం కల్పించే చర్యలు తీసుకున్నదని చెప్పారు. ఇక, పరిపాలనా విధానంతో కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, అవినీతి రహితమైన పరిపాలన అందించడంలో నా ప్రభుత్వం గొప్ప విజయం సాధించిందని ఆయన తెలిపారు. తత్ఫలితంగా రాష్ట్రం సొంత ఆదాయ వనరులు గణనీయంగా అభివృద్ధి చెందయన్నారు. భారతదేశంలోని 29 రాష్ట్రాల్లో మరే రాష్ట్రానికి సాధ్యం కాని స్థాయిలో ఆర్థిక వృద్ధిని తెలంగాణ రాష్ట్రం సాధించిందన్నారు. 2014 నుంచి 2018 వరకు నాలుగు సంవత్సరాల కాలంలో 17.17 శాతం సగటు వార్షిక ఆదాయ వృద్ధిరేటు నమోదైందని ఆయన వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నెల నాటికి 29.93 శాతం ఆదాయాభివృద్ధి రేటు సాధించిందని సగర్వంగా సభకు తెలియచేస్తున్నానని చెప్పారు. జీఎస్‌టి వసూళ్లలోనూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విద్యుత్ రంగంలో రాష్ట్రం అద్భుత విజయాలు సాధించేందుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థల ఉద్యోగులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నానని గవర్నర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వివరించిన సంక్షేమ పథకాల్లో కొన్ని...

కుదుటపడిన వ్యవసాయం...

సమైక్య రాష్ట్రంలో కుప్పకూలిన వ్యవసాయ రంగాన్ని నిలబెట్టడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయన్నారు. వ్యవసాయం దండుగ అనే నిరాశ నిస్పృహల నుంచి రైతులను బయట పడేసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు రైతాంగానికి గొప్ప ఊరటనిచ్చాయన్నారు. 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్తుతో రైతుల కరెంటు కష్టాలు తీరాయి. ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యల వల్ల సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి. కల్తీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలను నిరోధించడానికి కఠినమైన చర్యలు చేపట్టింది. కల్తీలు, నకిలీలకు పాల్పడే వారిపై పిడి యాక్టు నమోదు చేయడానికి ప్రభుత్వం చట్టం కూడా తెచ్చింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కల్తీకి పాల్పడే వారిపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

రైతుబంధు...

పంట కాలంలో పెట్టుబడి కోసం రైతాంగం అక్కడా ఇక్కడా అప్పులు చేయాల్సిన అగత్యం ఉండకూడదని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందిందని చెప్పారు. రైతులకు పెట్టుబడి కోసం ఎకరానికి 4వేల చొప్పున రెండు పంటలకు 8వేల రూపాయలు దక్కుతుండంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నది. ఈ పథకాన్ని ఐక్యరాజ్యసమితి ప్రశంసించడం మనందరికీ గర్వకారణం. రైతుబంధు పథకం దేశంలో ఇప్పుడు ఓ రోల్ మోడల్ పథకంగా మారింది. చాలా రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమయ్యాయని గవర్నర్ పేర్కొన్నారు.

రైతుబీమా...

దురదృష్టవశాత్తు ఏ రైతైనా మరణిస్తే అతని కుటుంబం వీధిన పడొద్దనే మానవీయమైన ఆలోచనతో ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా రైతు ఏ కారణాల వల్ల మరణించినా, ఆ రైతు కుటుంబానికి 5 లక్షల రూపాయలను కేవలం పది రోజుల వ్యవధిలో ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ఇప్పటి వరకు 5,675 మంది రైతుల కుటుంబాలకు 283 కోట్ల రూపాయలు రైతుబీమా పథకం కింద సహాయం అందించింది.

భూరికార్డుల ప్రక్షాళన...

భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడం కోసం,భూ రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండడం కోసం దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయని సాహసం తెలంగాణ ప్రభుత్వం చేసిందని గుర్తుచేశారు. భూ రికార్డుల సమగ్ర ప్రక్షాళన కార్యక్రమం చేపట్టింది. ప్రభుత్వం చేసిన కృషితో దాదాపు 94 శాతం భూముల యాజమాన్యాల హక్కుల విషయంలో స్పష్టత వచ్చింది. సాదా బైనామాల ద్వారా జరిగిన భూముల క్రయ విక్రయాలకు చట్టబద్ధత కోసం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించింది. భూముల రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో ఇకపై వందకు వంద శాతం పారదర్శకత సాధించేందుకు సమూల సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం...

సమైక్య రాష్ట్రంలో తెలంగాణా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైపోయిందన్నారు. కుల వృత్తుల మీద ఆధారపడి జీవించే బీ సి కులాల జీవితాలు కుప్ప కూలి పోయాయన్నారు. ఈ వృత్తులకు ఆర్థిక చేయూత, ప్రోత్సాహం ఇవ్వడం వల్ల రాష్ట్రంలోని బిసిల స్థితిగతులను మార్చాలని తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తిరిగి నిలబెట్టాలని ప్రభుత్వం భావించింది. తెలంగాణా ప్రభుత్వం భారతదేశంలో మరే రాష్ట్రంలో కూడా అమలు చేయని గొప్ప కార్యక్రమాలను బిసిల కోసం రూపొందించి అమలు చేస్తున్నదని చెప్పారు.

గొర్రెల పంపిణీ...

గొల్ల, కురుమలు, మత్స్యకారులు, నేత కార్మికులు, విశ్వకర్మలు, చాకలి, మంగలి తదితర కులాల సోదరులు మన తెలంగాణకున్న గొప్ప మానవ సంపద అని పేర్కొన్నారు. సమాజానికి వీరు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. గొల్ల కుర్మలకు పెద్దఎత్తున గొర్రెలు పంపిణీ చేసే కార్యక్రమం ప్రభుత్వం ప్రారభించిందన్నారు. ఇప్పటికే 75 లక్షల గొర్రెలు పంపిణీ చేసింది. పెరిగిన జీవ సంపదతో ఇప్పటికే 1,200 కోట్ల రూపాయలకు పైగా ప్రయోజనం గొల్ల కుర్మలకు చేకూరింది. గొర్రెలకు కావలసిన దాణా కూడా ప్రభుత్వం ఉచితంగా పంపిణీచేస్తుండటంతో గొల్లకుర్మలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

చేపల పెంపకం...

రాష్ట్రంలో చేపల పెంపకాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించడం కోసం కావాల్సిన చేప పిల్లలను, రొయ్య పిల్లలను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. అన్ని జలాశయాల్లో కోట్లాది చేప పిల్లలను వదులుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు.

చేనేతకు ప్రోత్సాహం...

చేనేత కళకు తెలంగాణా పెట్టింది పేరంటూ కోనియాడారు. ఇక, గద్వాల, నారాయణ పేట, పోచంపల్లి, సిద్దిపేట, సిరిసిల్ల నేత ఉత్పత్తులు నేటికీ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. కాలమాన పరిస్థితుల వలన కొంత, సమైక్య పాలనలో ప్రదర్శించిన నిరాదరణ వల్ల కొంత చేనేత రంగం భయంకరమైన సంక్షోభంలో కూరుకుపోయింది. చేనేత కార్మికులు ఆత్మహత్యల పాలయ్యారు. చేనేత, పవర్ లూం కార్మికుల స్థితి గతులు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చింది. నేత కార్మికులు నేసే వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నది. విద్యార్థులకు, పోలీసులకు, ఇతర సంస్థల ఉద్యోగుల యూనిఫారాలు, బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా పంచే చీరల కోసం చేనేత ఉత్పత్తులను అదేవిధంగా పవర్లూం ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నది. చేనేత వారికి మరియు మరమగ్గాలవారికి నూలు, రసాయనాలపై 50 శాతం సబ్సిడీని కల్పిస్తున్నది

ఇతర కులాలకు ప్రోత్సాహం...

నవీన క్షౌరశాలలు పెట్టుకునేందుకు నాయీ బ్రాహ్మణులకు, బట్టలు ఉతికే అధునాతన యంత్రపరికరాలు కొనుగోలు చేసేందుకు రజకులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నది. కల్లుగీత వృత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది సంఖ్యలో తాటి, ఈత చెట్ల పెంపకం చేపట్టింది. అంతేకాకుండా చెట్ల పన్నును పూర్తిగా రద్దుచేసింది. ప్రమాదవశాత్తూ గీతకార్మికులు మరణిస్తే ఇచ్చే పరిహారాన్ని 5 లక్షల రూపాయలకు పెంచింది. సంచార కులాలు, ఆశ్రిత కులాలు, తదితర వర్గాలవారికోసం ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో దేశంలో మరెక్కడా లేని విధంగా ఎం.బి.సి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది.

విద్యారంగం...

విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రం చక్కగా ముందడుగు వేస్తున్నది. కేజీ టు పిజి ఉచిత విద్యావిధానంలో భాగంగా పెద్ద సంఖ్యలో రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వర్గాలకి చెందిన విద్యార్థులకోసం కేవలం 296 గురుకులాలు మాత్రమే అరకొర వసతులతో ఉండేవి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అన్ని హంగులతో, రికార్డు స్థాయిలో 542 కొత్త గురుకులాలు ఏర్పాటుచేసింది.

ప్రజారోగ్యం...

పేదలకు మెరుగైన వైద్యం లభించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో వసతులను ఎంతో అభివృద్ధి పరిచింది. ప్రభుత్వాసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేట్టు చేసింది. ప్రభుత్వ దవాఖానాలలో కావల్సిన వైద్య పరికరాలు, మందులు, ఆధునిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొనుగోలుకు కేటాయించే బడ్జెట్‌ను మూడింతలు పెంచి, ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా అందివ్వడానికి అందుబాటులో ఉంచింది. 40 ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఎం.ఆర్.ఐ, సిటీస్కాన్, డిజిటల్ రేడియాలజీ, టూ డి ఎకో, తదితర అత్యాధునిక పరికరాలను వివిధ దవాఖానాలలో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. జిల్లా, ఏరియా ఆస్పత్రులలో ఐ.సి.యు కేంద్రాల సంఖ్య కూడా పెంచడం జరిగింది. ఉత్తమ వైద్యసేవలు అందించినందుకు మన రాష్ట్రానికి పలు జాతీయస్థాయి అవార్డులు కూడా లభించాయి. హైదరాబాద్ నగరంలో వైద్యసేవలను మరింత విస్తరించి, పేదలందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతీ పదివేల మందికి ఒకటి చొప్పున బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కేసీఆర్ కిట్స్...

ఆసుపత్రులలో సురక్షిత ప్రసవాలు జరగాలనే ప్రధాన లక్ష్యంతో కేసీఆర్ కిట్స్ వంటి పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఈ పథకం క్రింద నిరుపేద గర్భిణులకు 12,000 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తున్నదని ఆయన చెప్పారు. ఆడపిల్లను ప్రసవించిన తల్లికి ప్రోత్సాహకంగా మరో 1,000 రూపాయలు ప్రభుత్వం అదనంగా చెల్లిస్తున్నది. దీనితోపాటు నవజాత శిశువులకు, బాలింతలకు కావల్సిన 16 రకాల వస్తువులతోకూడిన 2,000 రూపాయల విలువైన కిట్ ను కూడా అందిస్తున్నది.

కంటి వెలుగు..

దృష్టిలోపంతో బాధపడే వారికి కంటి వైద్యాన్ని చేరువలోకి తీసుకు రావడం కోసం ప్రభుత్వం కంటి వెలుగు పథకం ప్రారంభించిందన్నారు.

ఇఎన్‌టి దంత పరీక్షలు..

కంటి వెలుగు తరహాలోనే చెవి, ముక్కు, గొంతు, దంత సంబంధమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందించడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈ పథకం అమలు కోసం ప్రాథమికమైన ఏర్పాట్లను ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు.

పరిపాలన సంస్కరణలు..

ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడం కోసం మన రాష్ట్రంలో విప్లవాత్మకమైన పరిపాలనా సంస్కరణలను విజయ వంతంగా అమలు చేసుకున్నామని గవర్నర్ చెప్పారు. దేశ చరిత్రలో ఇంత తక్కువ సమయంలో ఇంత భారీ పాలనా సంస్కరణలు మరెక్కడా జరగలేదు. పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వేగాన్ని, పారదర్శకతను పెంచడం కోసం, 10 జిల్లాలను 31 జిల్లాలు చేసుకున్నాం. కొత్తగా నారాయణపేట, ములుగు జిల్లాలను ఏర్పాటు చేసుకుంటున్నాం. 43 రెవెన్యూ డివిజన్ల సంఖ్యను 69కి పెంచుకున్నాం. 459 మండలాలను 584 మండలాలు చేసుకున్నాం.

గ్రామ పంచాయితీలుగా తండాలు...

మా తండాలో మా రాజ్యం అనే నినాదంతో తండాలు, గూడాలను ప్రత్యేక పంచాయితీలుగా ఏర్పాటు చేయాలని ఎస్టీలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. వారి కలను తెలంగాణ ప్రభుత్వం నిజం చేసింది. రాష్ట్రంలో కొత్తగా 1,326 ప్రత్యేక ఎస్టీ గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేసింది.వీటికి తోడు 1,311 గ్రామ పంచాయితీలు షెడ్యూల్ ఏరియాలోనే ఉన్నాయి. ఇతర గ్రామ పంచాయితీల్లోనూ ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించింది. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో 3వేల మంది ఎస్టీలు రాష్ట్రంలో సర్పంచులుగా అయ్యే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దేశంలో ఎస్టీల కోసం ఇంత పెద్ద ఎత్తున పంచాయతీను ఏర్పాటు చేసిన ప్రభుత్వం మరొకటి లేదు. ఇది అభ్యుదయ పంథాలో నడుస్తున్న తెలంగాణ ప్రభుత్వం సాధించిన చారిత్రక విజయం.

కొత్త జోనల్ వ్యవస్థ...

తెలంగాణా సాధించుకున్న ఫలితం సంపూర్ణంగా పొందాలంటే స్థానికులకే ఉద్యోగావకాశాలు దక్కాలన్నారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన స్థానికుల హక్కులు పరిరక్షించటం కోసం, ప్రభుత్వం కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. లోకల్ కేడర్ ఉద్యోగాలలో 95 శాతం అవకాశాలు స్థానికులకే లభించే విధంగా చట్టం చేసిందన్నారు.

పారిశ్రామికాభివృద్ధి...

రాష్టంలో పరిశ్రమల స్థాపనకోసం ముందుకువచ్చే వారికి టీఎస్ ఐపాస్ సింగిల్ విండో విధానం ఎంతో ఆకర్షణీయంగా ఉందన్నారు. కేవలం 15 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు పరిశ్రమల స్థాపనకు లభిస్తున్నాయన్నారు. ఇప్పటి దాకా 8వేల పరిశ్రమలకు ఈ విధానం ద్వారా అనుమతులు లభించగా అందులో 5,570 పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించాయన్నారు. 1,32,000 కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి తరలి వచ్చినయి. 8.37 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఖాయిలా పడిన కాగజ్ నగర్ సిర్పూర్ మిల్లును ప్రభుత్వం పూనుకొని పునరుద్ధరించింది.

ఐటి రంగంలో బలీయమైన శక్తిగా తెలంగాణ..

తెలంగాణ రాష్ట్రం ఐటి రంగంలో బలీయమైన శక్తిగా ఎదిగిందన్నారు. ప్రపంచంలో హైదరాబాద్ ప్రముఖ ఐ.టి హబ్ గా గుర్తింపు పొందింది. రాష్ట్రప్రభుత్వం రూపొందించిన నూతన ఐ.టి విధానంతోపాటు, సింగిల్ విండో పారిశ్రామిక అనుమతుల విధానం వల్ల ఐ.టి రంగంలో గణనీయమైన పెట్టుబడులు రావడం ప్రారంభమైందన్నారు. ఎన్నో దిగ్గజ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయి. అంకుర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన టి.హబ్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ళు...

నిరుపేదలకు గృహనిర్మాణం పథకం అమలుచేయడంలో కూడా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నూటికి నూరు శాతం ప్రభుత్వ ఖర్చుతో డబుల్ బెడ్ రూం ఇళ్ళను నిర్మించి ఇవ్వడం దేశంలోనే ప్రథమమని ఆయన పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళ పథకం క్రింద ఇప్పటి వరకు 2, 72, 763 ఇళ్ళను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇండ్ల నిర్మాణం సాగుతున్నదన్నారు. బలహీనవర్గాల గృహనిర్మాణ పథకం కింద లబ్ధిదారులు గతంలో చెల్లించవలసి వున్న 4వేల కోట్ల రూపాయల రుణబకాయిలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

అందరినీ కలుపుకుని పోతా..



- ప్రజల గొంతును వినిపిస్తాం..
- రాహుల్‌కు థాంక్స్
- గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం లేదు
- సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి19(మనంప్రతినిధి): సీఎల్పీ నాయకుడిగా అందరు సభ్యులను కలుపుకుపోతానని, అందరి సహకారంతో ప్రజల గొంతును వినిపిస్తామని సీఎల్పీ నాయకుడిగా నియమితులైన సీనియర్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. తనను సీఎల్పీ నాయకుడిగా నియమించినందుకు ఎఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీకి భట్టి థాంక్స్ చెప్పారు. తనకిచ్చిన బాధ్యతలతో పార్టీ ప్రతిష్టను పెంచేందుకు ప్రయత్నిస్తానని, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ మారుతారని టీఆర్ఎస్ పార్టీ మైండ్ గేం ఆడుతోందని, వారి ఆకర్షకు లొంగేవారెవరు లేరన్నారు. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగంలో కొత్తదనం లేదన్నారు. నిరుద్యోగభృతి, పింఛన్లు, డబుల్ బెడ్ రూం, ఉద్యోగాల కల్పన తదితర పథకాలకు సంబంధించి ఎప్పుడు ప్రారంభిస్తారో గవర్నర్ తన ప్రసంగంలో స్పష్టం చెయ్యలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించేందుకు నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని చెప్పారు. నిరుద్యోగుల గురించి వాస్తవాలను గవర్నర్ తన ప్రసంగంలో చెప్పి ఉంటే సంతోషించే వారమని భట్టి వ్యాఖ్యానించారు.

సభను హుందాగా నడిపిస్తారని ఆశిస్తున్నాం.....

అధికార పార్టీ శాసనసభను హుందాగా నడిపిస్తుందన్న ఆశాభావాన్ని భట్టి విక్రమార్క వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలు, రాజ్యాంగం పట్ల నమ్మకంతో ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆకాంక్షించారు. ప్రధాన ప్రతి పక్షంగా ప్రజాసమస్యలను సభలో లేవనెత్తుతామని చెప్పారు.

సీఎల్పీ నాయకుడి నియామకం లేఖ స్పీకర్‌కు అందజేశాం...

తనను సీఎల్పీ నాయకుడిగా నియమిస్తూ ఎఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఇచ్చిన లేఖను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి సమర్పించినట్లు భట్టి విక్రమార్క చెప్పారు. సభ సజావుగా నడిచేందుకు ప్రధాన ప్రతిపక్షంగా సహకరిస్తామని, ప్రభుత్వం కూడా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యహరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలియజేశారు. మహ్మద్ అలీ షబ్బీర్ , సీనియర్ సభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి, డి శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి భట్టి స్పీకర్ ను కలిశారు.

భట్టి నియామకాన్ని స్వాగతిస్తున్నాం...

- మా వాళ్లు పార్టీ మారరు
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సీతక్క,రేగా కాంతారావు , ఆత్రం సక్కు

హైదరాబాద్, జనవరి19(మనంప్రతినిధి) : సీఎల్పీ నాయకుడిగా సీనియర్ సభ్యుడు మల్లు భట్టి విక్రమార్క నియామకాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్వాగతించారు. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సీతక్క, రేగా కాంతారావు, ఆత్రం సక్కు శనివారం శాసనసభ మీడియా పాయింట్ వద్ద విలేఖరులతో మాట్లాడారు. దళిత వర్గానికి చెందిన భట్టిని సీఎల్పీ నాయకుడిగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలెవరు కూడా టీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీతక్క, ఆత్రం సక్కు, రేగా కాంతారావు సీఎం కేసీఆర్‌ను కలిసి ఆదివాసుల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దాదాపు గంట పాటు వారు సీఎంతో భేటీ అయ్యారు. మేడారం సమ్మక్క సారక్క జిల్లా ఏర్పాటు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేసినట్లు వారు మీడియాకు చెప్పారు. హరితహారం పేర ఆదివాసుల భూములను లాక్కున్నారని, తిరిగివారికి ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆదివాసులు సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరినట్లు తెలిపారు.

మహిళల భద్రతకు షీం టీంతో పాటు కొత్త చట్టాలు

హైదరాబాద్, జనవరి 19 (మనం ప్రతినిధి) : ప్రభుత్వం మహిళల భద్రతకు ఎంతగానో కృషి చేస్తుందని ,మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు షీ టీంలతో పాటు పలు చట్టాలను రూపొందించడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ రాగం సుజాతయాదవ్ పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో మహిళల భద్రత మనందరి బాధ్యత పేరిట రూపొందించిన పుస్తకాన్ని శనివారం నాంపల్లి గగన్ విహార్‌లోని తమ కార్యాలయంలో ఆమె చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా ఎదుర్కొం టున్న గృహ హింస చట్టాలపై బాలబాలికలను కాపాడుకును అంశాలు , పిల్లలకు అందించాల్సిన న్యూట్రీషన్ ఆహార పదార్థాల సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈపుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. మహిళలను కాపాడుకోవాల్సిన అవ సరం ఎంతైనా ఉందని, మహిళల భద్రతకు ప్రభుత్వం సైతం ఎన లేని కృషి చేస్తున్నదన్నారు. ఎక్కడైతే మహిళ గౌరవించబడుతుందో అక్కడ సుభిక్ష వాతావరణం చోటు చేసుకుంటుందని చెప్పారు. మహిళలకు సంబంధించిన అన్ని చట్టాలపై అవగాహన కల్పించే దుకు ప్రత్యేకంగా ఈపుస్తకాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి జయశ్రీ, బోర్డు అధికారులు సత్యనారాయణ, వకులాదేవి, కిరణ్, సురేష్, సువర్ణ, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు అభినందనల వెల్లువ

- అసెంబ్లీ ఛాంబర్‌లో కలిసి అభినందించిన కడియం



హైదరాబాద్, జనవరి 19, (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర శాసన సభ రెండవ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోచారం శ్రీనివాస రెడ్డిని అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్‌ని కడియం అభినందించారు. స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డితో తనకు అన్నదమ్ముల అనుబంధం ఉందని ఈ సందర్భంగా కడియం శ్రీహరి గుర్తు చేశారు. పోచారం శ్రీనివాసరెడ్డికి ఉన్న అపారమైన రాజకీయ, పాలనా అనుభవం తెలంగాణ స్పీకర్‌గా శాసనసభ నిర్వహణలో బాగా ఉపయోగపడుతుందన్నారు. ఆయనకు ఉన్న ఓపిక సభ్యుల చెప్పిన వాటిని వినడంలో, ఆయనకున్న సమర్థత వాటి పరిష్కారంలో గొప్పగా ఉపయోగపడనుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నారని, వ్యవసాయాన్ని పండగ చేస్తున్నారని అందుకు నిదర్శనంగా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రైతును, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డిని ఇప్పుడు రాష్ట్రంలో అత్యున్నత పదవిలో కూర్చోబెట్టి రైతుకు తమ ప్రభుత్వం ఇస్తున్న గౌరవాన్ని చాటి చెప్పారని తెలిపారు. ఇది రైతు ప్రభుత్వమని రైతును రాజు చేయడమే గౌరవ సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డికి.. కడియం శ్రీహరి మరోసారి అభినందనలు తెలిపారు.

21 నుంచి మహారుద్ర సహిత సహస్ర చండీయాగం

- ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్న కేసీఆర్
- 250 మంది రుత్విక్కుల నేతృత్వంలో 5 రోజుల పాటు యజ్ఞం
- శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి ఆశీస్సులతో కొనసాగనుంది
- బంగారు తెలంగాణ అభివృద్ధి, ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యంగా యాగం
- యజ్ఞాలు నిర్వహించడంలో దేశంలోనే కేసీఆర్‌కు సాటిలేదు
- 1996లో సహస్ర లక్ష్మీసూక్త సహిత అభిషేకం..
- 2015 డిసెంబర్ 23న ఆయుత శతచండీయాగం...



హైదరాబాద్, జనవరి 19, (మనం ప్రతినిధి): ఎవరూ చేయలేని సాహసాలు, ఊహకందని నిర్ణయాలు తీసుకోవడంలో ఉద్యమనేత, గులాబీ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం కేసీఆర్ తప్ప మరొకరు ఉండరేమో!. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించినట్లుగానే, తెలంగాణలో ఆయన ప్రవేశ పెట్టిన ఎన్నో పథకాలు ఇప్పుడు దేశంలోనే భారీ చర్చకు వచ్చేలా చేయగలిగారు. ఆయన ఏ కార్యక్రమమైనా పూజాదికాలతోనే మొదలుపెడతారు.యాగాలు, చేయడంలో ఆయనకు ఆయనే సాటి. ఇప్పటి వరకు, యజ్ఞ యాగాలతో ఆధ్యాత్మిక లోకానంతటిని తన వైపుకు తిప్పుకున్న సీఎం కేసీఆర్...తాజాగా, మరో మహాయాగ క్రతువుకు శ్రీకారం చుట్టారు. చతుర్వేద,పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీయాగం పేరుతో ఈ నెల 21న సోమవారం నుంచి ఐదురోజుల పాటు ఈ యాగం నిర్వహించబోతున్నారు. ఈ మహాయాగం 250 మంది రుత్వికుల సమక్షంలో తెలంగాణ అభివృద్దే లక్ష్యంగా,జాతీయ రాజకీయాల్లో రాణించడమే ధ్యేయంగా ఈ యాగం జరగనుందని తెలుస్తోంది.

మొదటినుంచి సీఎం కేసీఆర్ సెంటిమెంట్ ఎక్కువ. దైవభక్తి విషయంలోనూ ఆయనను మించినవారు ఉండరేమో. అందుకే కేసీఆర్ మొదలుపెట్టే ప్రతి పనికి ముందు గ్రహస్థితి,తిథి,వార, నక్షత్ర, వాస్తు బలం, ముహుర్తాలు, సంఖ్యాశాస్త్రం...జాతకాలు నమ్ముతారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్నవాళ్లకు ఇవన్నీ మామూలుగా అనిపించినా....సామాన్య ప్రజానికానికి మాత్రం ఆసక్తికరమైన అంశమే అని చెప్పక తప్పదు. అందుకే కేసీఆర్ ఏ యాగం నిర్వహించతలపెట్టినా అది చర్చకు దారితీస్తుందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఇటీవల తెలంగాణలో జరిగిన ముందస్తు ఎన్నికల్లో తిరుగులేని రాజకీయ శక్తిగా టీఆర్ఎస్ ఆవిర్భవించినందుకు సీఎం కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలో మరో మహాయాగానికి శ్రీకారం చుట్టారు. చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీయాగంపేరుతో నిర్వహిస్తున్న యాగం శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థస్వామి ఆశీస్సులతో జరగనుంది. తెలంగాణ నలుమూలలనుంచి 250మంది రుత్వికులు ఇప్పటికే ఫామ్ హౌజ్ కు చేరుకున్నారు.

యజ్ఞ యాగాదులకు ప్రాధాన్యం

కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చేస్తున్న యాగాలు ఇప్పుడిప్పుడే దేశంలోని ప్రజలందరికీ ఇన్ని యాగాలున్నాయని తెలుస్తున్నాయి. కానీ, ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి యాగాలు చేయడం కేసీఆర్‌కు అలవాటుగా ఉందని కొందరు దగ్గరి వారు చెప్తున్నారు. 1996 నుంచి కేసీఆర్‌కు యాగాలు నిర్వహించడం అలవాటు ఉండటం విశేషం. 1996లో సిద్దిపేటలో సహస్ర లక్ష్మి సూక్త పారాయణాలు. సహస్ర లక్ష్మి సూక్త పారాయణ సహిత అభిషేకాలు.....1997లో బాపిశాస్త్రి ఆధ్వర్యంలో చండీహననం నిర్వహించారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం టిఆర్ఎస్ స్థాపించారు. 2005లో కేంద్రమంత్రిగా ఢిల్లీలోని తన నివాసంలో నవగ్రహ మఠం, చండీయాగం...2006లో సహస్ర చండీయాగం...

2007లో పాలకుర్తి నరసింహ రామశర్మ సిద్దాంతి ఆద్వర్యంలో చండీయాగం, సుదర్శన యాగం...2008లో సిద్దిపేట కోటిలింగాల ఆలయంలో గాయత్రీ యాగం నిర్వహించారు. 2009 ఎన్నికల అనంతరం టిఆర్ఎస్ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంది. ఆ సమయంలోనే తెలంగాణ భవన్ వేదికగా 27 రోజుల పాటు నక్షత్ర మండల యాగం నిర్వహించారు. అనంతరం కెసీఆర్ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. మళ్లీ 2010 సంవత్సరంలోనూ తెలంగాణ భవన్లో చండీయాగం.... 2011లో బండ్లగూడలోని ఎంపీ జితేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శతచండీయాగం నిర్వహించారు. ఆ తర్వాత కెసీఆర్ పూర్తిగా తెలంగాణ సాధనే ధ్యేయంగా ఢిల్లీ నుంచి గల్లీ దాకా పోరాటాన్ని ఉదృతం చేశారు. 2014 తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కెసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాద్యతలు చేపట్టారు. 2015 నవంబర్ 27న నవ చండీయాగం నిర్వహించిన కెసీఆర్....శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో ఆయుత శత చండీయాగాన్ని నిర్వహించారు. 2015 డిసెంబర్ 23 నుంచి 27వరకు ఆయుత శతచండీయాగాన్ని కనీవినీ ఎరుగని రీతిలో ఎర్రవల్లిలోని తన వ్యవసాయక్షేత్రం పక్కన ఘనంగా నిర్వహించారు. ఈ యాగాన్ని జాతీయ స్థాయిలో రాజకీయ నేతలను ఆహ్వానించడమే అప్పటి రాష్ట్ర పతి ప్రణబ్ ముఖర్జీని యాగా పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆహ్వానించారు కేసీఆర్. జాతీయ స్థాయిలో ఆయుత చండీయాగం చర్చనీయాంశమైంది. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం అన్నివిధాల సస్యశ్యామలంగా ఉండాలని ఈ యాగం నిర్వహించినట్లు తెలిపారు.



ఇక, 2014 తర్వాత అటు పార్టీలోనూ....ఇటు ప్రభుత్వ పరంగా కేసీఆర్‌కు ఎదురులేకుండా పోయింది. ఆయన తలపెట్టిన ప్రతికార్యం విజయవంతం అవుతుండటంతో అప్పడప్పుడు సుదర్శన యాగాలు పరిపాటిగా నిర్వహించారు. అంతేకాదు ఉద్యమ సమయంలో తాను మొక్కిన మొక్కులను అన్ని దేవాలయాలు తిరిగి చెల్లించుకున్నారు కేసీఆర్. కురవి వీరభద్ర స్వామికి వెండి మీసాలు, వరంగల్ భద్రకాళి అమ్మవారికి స్వర్ణకవచం, కిరీటాలు, ఇతర అభరణాలు సమర్పించారు. అనంతరం తిరుపతి వెంకటేశ్వర స్వామికి సాలగ్రామ హారాన్ని, కంఠాభరణం, తిరుచానూర్ పద్మావతి అమ్మవారికి ముక్కుపుడక సమర్పించారు. ఆ తరువాత విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ముక్కుపుడకను సమర్పించారు. ఇలా కెసీఆర్ రాజకీయాల్లో ఉన్నా....సెంటిమెంట్ ను మాత్రం వదిలిపెట్టడం లేదు. కేసీఆర్ తన సెంటిమెంట్‌ను మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు సైతం అమలు చేసి చూపించారు. ఎన్నికల ప్రచారానికి బయలుదేరే ముందు తన వ్యవసాయ క్షేత్రంలో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేద్ర స్వామి నేతృత్వంలో రాజ శ్యామల యాగాన్ని రెండురోజుల పాటు నిర్వహించి...పూర్ణాహుతి గావించి అదే రోజు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మొన్నటి ఎన్నికల్లో టీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యంతో మరోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. దీంతో మరోసారి శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి ఆశీస్సులతో చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీయా గాన్ని కేసీఆర్ నిర్వహించనున్నట్లు అత్యంత విస్వాసనీయంగా వర్గాల ద్వారా సమాచారం తెలుస్తోంది.

తెలంగాణ అభివృద్ధికి ఉద్యమనేత, సీఎం కేసీఆర్..చేసిన యాగాలు...

1996లో సహస్ర లక్ష్మి సూక్త పారాయణాలు. సహస్ర లక్ష్మి సూక్త పారాయణ సహిత అభిషేకం.

1997లో బాపిశాస్త్రి ఆధ్వర్యంలో చండీహననం.

2005లో కేంద్రమంత్రిగా ఢిల్లీలోని తన నివాసంలో నవగ్రహ మఠం, చండీయాగం.

2006లో సహస్ర చండీయాగం.

2007లో పాలకుర్తి నరసింహ రామశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో చండీయాగం, సుదర్శన యాగం.

2008లో సిద్దిపేట కోటిలింగాల ఆలయంలో గాయత్రీ యాగం.

2009లో తెలంగాణ భవన్లో 27 రోజుల పాటు నక్షత్ర మండల యాగం.

2010లో తెలంగాణ భవన్లో చండీయాగం.







హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో దృశ్యాలు..


రాద్ధాంత రాజకీయాల వైపు..!

రాజకీయాలకు మన నేతలు నేడు కొత్తకొత్త నిర్వచనాలు తీసుకొచ్చారు. ఒకప్పుడు రచ్చబండ రాజకీయాలని ఉండేవి. ఇప్పుడు ఆ రచ్చబండలు లేవు, ఆ రాజకీయాలు కానరావు. కానీ, ఆ రచ్చబండ రాజకీయాలే నేడు రూపాంతరం చెంది మన దేశ రాజకీయాల్లోకి తరలివచ్చాయంటే అతిశయోక్తి లేదేమో! ప్రజల్లో చైతన్యం పెరిగిందని చెప్పుకుంటున్నాం గానీ, అంతా రాజకీయ నాయకుల ప్రచారపటాటోపమే తప్ప ప్రజలు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ అమాయకులే! మాయమాటలకు తలొగ్గేవారే! రాజకీయ నాయకుల మోసాలకు బలయ్యేవారే! ఇందులో మరో మాట లేదు... మరో భావం అక్కరలేదు.

ఏడు దశాబ్దాల క్రితం స్వాతంత్ర్యానంతరం ఘనమైన రాజ్యాంగాన్ని రాసుకున్నాం... ఘనంగా చెప్పుకుంటున్నాం. మనకున్న ప్రజాస్వామ్యాన్ని ఎంతో గొప్పగా కీర్తిస్తున్నాం. ప్రజలకు తమకిష్టమైన తీరులో నివశించే ప్రాథమిక హక్కులున్నాయని మురిసిపోతున్నాం. కానీ, స్వాతంత్ర్యానంతరం ఆ మురిపెం మూడు నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, ద్వితీయ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి పాలన వరకు అంతా సవ్యంగానే సాగిందని చెప్పుకోవచ్చు. ఏవో అక్కడక్కడా అడపాదడపా చిన్నచిన్న సంఘటనలు మినహా ప్రజలను ప్రభావితం చేసి ప్రభుత్వాల తీరును తప్పుపట్టే విధంగా మాత్రం పాలన సాగలేదు. సరిగ్గా ఇందిరా గాంధీ హయాం వచ్చేసరికి రాజకీయాలంటే నిర్వచనం మారడం ప్రారంభమైంది. ఎవరు అవునన్నా కాదన్నా ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు అనుకునే స్థాయి నుంచి పదవి కోసం, పదవి చేత, పదవే పాలన నిర్వహించే దుష్ట సంస్కృతి ప్రవేశించింది. దాంతో ప్రజల అవసరాలు, సమస్యలు అనేవి అటకెక్కాయి. అసలా మాటలే అనరాని ఉచ్చరించరాని మాటలుగా మన నేతలు తీర్మానించేశారు.

అనంతర కాలంలో దేశరాజకీయాల్లో పెను మార్పులు సంభవించాయి. ఇందిర పరంపరలోనే బాధ్యతలు స్వీకరించిన ఒక్కొక్క ప్రధాని ఒక్కొక్క రీతిలో హక్కుల హననానికి శ్రీకారం చుట్టడం దేశ ప్రజల దౌర్భాగ్యంగా భావించవచ్చు. ఈ నేపథ్యంలో కేంద్రంలో పాలనాబాధ్యతలు స్వీకరించిన పెద్దల వ్యవహార శైలి కారణంగా వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ భావనలకు అంకురం ఏర్పడింది. ఫలితంగా రాష్ట్రానికో తీరులో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ఇలా ఉద్భవించిన ప్రాంతీయ పార్టీలు జాతీయ భావనలకు తిలోదకాలిచ్చి తమతమ రాష్ట్రాల కోసమేనంటూ, రాష్ట్రాల అభివృద్ధే తమ లక్ష్యమని ప్రజలకు ఆకట్టుకోవడం ప్రారంభించాయి. వాటికి ప్రజలు కూడా బ్రహ్మరథం పట్టసాగారు.

తమిళనాడులో ద్రవిడ కజగంతో మొదలైన ఈ ప్రాంతీయ పార్టీల పవనాలు నెమ్మది నెమ్మదిగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశా, అసోం...ఇలా సమస్య ఉన్నచోటల్లా ప్రాంతీయ పార్టీల జెండాలు రెపరెపలాడసాగాయి. దాంతో ప్రజల్లో జాతీయ భావం సన్నగిల్లడంతో అంతర్రాష్ట్ర సమస్యలకు ఆనవాలంగా తయారైంది రాజకీయం. ఒక్కొక్క ప్రాంతీయ పార్టీది ఒక్కొక్క నినాదం... దానికి ప్రజలు సై అనడం... వెరశి రాష్ట్రానికి, రాష్ట్రానికి మధ్య వైరం, జల వివాదాలు!



> సిద్ధాంత రాజకీయాల స్థానంలో రాద్ధాంత రాజకీయాలు ప్రవేశించాయి. నేడు దేశంలో ఏ రాజకీయ పార్టీ చూసినా ఏమున్నది గర్వకారణం?... పార్టీలన్నీ విమర్శల స్థాయి నుంచి తిట్లు, శాసనార్థాల వరకు చేరుకున్నాయి. వ్యక్తిగత విమర్శలు, వ్యక్తుల వ్యక్తిత్వాల హననానికి అంతేలేకుండా పోతోంది. ఒకప్పుడు రాజకీయాలంటే ప్రజా సమస్యలు, ప్రజల కోసం, ప్రజల చేత అని చెప్పుకునే వారు. నేడు రాజకీయాలంటే ఒకరిపై మరొకరికి ఉండే వ్యక్తిగత విద్వేషం, దాని ఫలితంగా వెల్లువెత్తే బూతులు... ... ఇలా తయారయ్యాయి రాజకీయాలంటే!

ఈ నేపథ్యంలో జాతీయ పార్టీల ఉనికికి ప్రమాదం వాటిల్లే పరిస్థితులు తలెత్తడంతో రాజీకి రావలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రాంతీయ పార్టీల బాటనే ఆయా జాతీయ పార్టీలు పట్టడంతో ప్రజా సమస్యలపై పోరాడే పార్టీలే దేశంలో కరువయ్యాయి. ఈ బాటనే వామపక్షాలు అనుసరించడంతో ప్రజాదరణలో వెనకబడ్డాయి. ప్రాంతీయ పార్టీల ప్రాభవం పెరగడం దేశంలో కొత్త సమస్యలకు కారణమైంది. ప్రాంతీయ పార్టీల వెనకే జాతీయ పార్టీలు పెరగడంతో రాజకీయ విలువలకు తిలోదకాలివ్వాల్సి వచ్చింది. దాంతో ప్రజాసమస్యలు గాలికి కొట్టుకుపోయి వ్యక్తిగత స్వార్థం ప్రబలి వ్యక్తుల ప్రైవేట్ జీవితంపై విమర్శలు రావడం ప్రారంభమైంది. అది అక్కడితో ఆగక వ్యక్తుల వ్యక్తిత్వాలపైకి పాకింది. నిత్యం ఒకరినొకరు తిట్టిపోసుకోవడం, ఒకరిపై మరొకరు బూతుల పంచాంగంతో విరుచుకుపడడం సర్వసాధారణమైంది. ఈ తీరులో రాజకీయాలు కొత్త ఒరవడితో (దుష్ట సంస్కృతికి దారితీసేలా) అనైతిక పొత్తులకు తెరలేచింది. ఈ పొత్తుల కోసం సైద్ధాంతిక విభేదాలు కాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలకే ప్రాముఖ్యం ఇవ్వడం మొదలైంది.

సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఈ అనైతిక పొత్తులు ప్రఖ్యాత సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు రాజకీయప్రవేశంతో కొత్త పుంతలు తొక్కింది. తూర్పు పడమరగా వ్యవహరించే వామపక్షాలు, బీజేపీ మధ్య పొత్తు నిర్విఘ్నంగా దాదాపు దశాబ్ద కాలం కొనసాగింది. ఒందుకు వారు ఎంచుకున్న మార్గం కాంగ్రెస్‌ను ఓడించడం! కాంగ్రెస్ ఓటమితో తమ పని తాము నిర్వర్తించామని ఎవరికివారు వేర్వేరయ్యారు. అంటే ఇక్కడ సైద్ధాంతిక విభేదాలు కాంగ్రెస్ ఓటమి వరకు గుర్తుకు రాకపోగా వాటిని ఏ రాజకీయ పార్టీ కూడా పట్టించుకోలేదు. ఏదో ప్రజలు తమకు అప్పగించిన గురుతర బాధ్యత ఆయిన కాంగ్రెస్ ఓటమితో తమ బాధ్యత తీరిందని భావించి అనంతరం సైద్ధాంతిక విభేదాలను వల్లెవేయడం మొదలుపెట్టాయి. ఈ రాజకీయ క్రీడలో లాభపడింది ప్రాంతీయ పార్టీలు కాగా, తీవ్రంగా నష్టపోయింది మాత్రం వామపక్షాలే అనడంలో సందేహం లేదు. ఒక ఎన్నికలో దుర్మార్గుడుగా కనిపించిన నాయకుడు మరుసటి ఎన్నికల్లో సన్మార్గుడుగా, ప్రజల కోసమే ఉద్భవించిన మహానేతగా కనిపించాడు. ఈ క్రీడలో వామపక్షాలు తమకున్న కేడర్‌ను కూడా కోల్పోయాయి.

బీజేపీ విధానాలు, నరేంద్ర మోదీ, అమిత్ షా వ్యవహారశైలి ప్రస్తుతం దేశవ్యాప్త చర్చకు దారితీయడం మరో పరిణామం. మోదీపై ఎన్నో ఆశలతో, కాంగ్రెస్‌పై వ్యతిరేకతతో ప్రజలు ఓటు వేస్తే ఆ ఓటరుకే పంగనామాలు పెట్టే కార్యక్రమాలను చేపట్టడం మోదీపై ప్రజల భ్రమలు పొగమంచు తీరుగా విడిపోవడం మొదలైంది. ఏ బట్ట కట్టాలో మోదీ చెప్తారు, ఏ తిండి తినాలో శాసిస్తారు, ఏ దేవుడిని పూజించాలో నిర్ణయిస్తారు... వ్యతిరేకించిన వారంతా దేశద్రోహులు, జాతి విద్రోహులై కేసులెదుర్కోవలసి వస్తోంది. రాజకీయ ప్రత్యర్థులపై సీబీఐ, ఆదాయపుపన్ను అస్త్రాలు సిద్ధంగా ఉంటాయి. ఇదంతా చూస్తుంటే కేవలం పదవి కోసం ఇందిరా గాంధీ అనుసరించిన విధానాన్ని ఎండగట్టిన బీజేపీ పార్టీయే దేశాన్ని పాలిస్తోందా? లేక బీజేపీ ముసుగు వేసుకున్న కాంగ్రెస్ నేతలే దేశాన్ని, ప్రజల్ని శాసిస్తున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

రాజకీయాల్లో వ్యాపార ధోరణులు పెరిగిన తరువాత నేతల్ని ప్రజలు శాసించడం లేదు... పారిశ్రామికవేత్తలే శాసిస్తున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా నేతలంతా పారిశ్రామికవేత్తల అడుగులకు మడుగులొత్తడం, దేశంలో అన్నదాతల ఆక్రందనలను పట్టించుకోకుండా పారిశ్రామికవేత్తల కోసమే పనిచేసే ప్రభుత్వాలున్న నేపథ్యంలో విలువలు, సిద్ధాంతాలు అనుకోవడం గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలొస్తున్నాయన్న చందంగా ఉంటుంది. అవకాశ రాజకీయాలు రాజ్యమేలుతున్న తరుణంలో ఇంతకు మించి ఆశించడం అతిగానే కనిపిస్తుంది.

◆ శీలోజు యాదగిరి

ప్రజల ఎన్నికల ప్రణాళిక

త్వరలో ఎన్నికల మేళం రాబోతుంది! బ్యాండ్‌మేళం చూశాం, సన్నాయి మేళం చేశాం, తీన్‌మార్ మేళం చూశాం, గంగిరెద్దుల మేళం కూడా చూశాం! కానీ ఈ ఎన్నికల మేళమేమిటా అని ఆశ్చర్యపోతున్నారా? ఇది మనదేశంలో అయిదేళ్ళకోసారి వస్తుంది. కొండకచో కొంచెం ముందుగా కూడా రావచ్చును. ఎన్నికలలో ప్రతి పార్టీ తన ఎన్నికల ప్రణాళిక అదేనండీ మ్యానిఫెస్టో ప్రకటిస్తుంది. అందులో అనేక వాగ్దానాలు గుప్పిస్తుంది. అంతేగానీ తనకు ఓట్లేసే ప్రజలను అస్సలు పట్టించుకోదు. వారికి ఏం కావాలో అడగదు. అందుకే ప్రజలకు తమకు ఏం కావాలో తమ ఎన్నికల ప్రణాళిక ద్వారా ప్రకటిస్తున్నారు.

మనదేశంలో కులాలకేమీ తక్కువలేదు. అందుకే అన్ని కులాలకు కార్పొరేషనులు ఏర్పాటు చేయాలి. ఒక్కొక్క కార్పొరేషన్‌కూ అయిదువేల కోట్లు కేటాయించాలి. ప్రతి నగరంలోనూ, గ్రామంలోనూ వాటికి భవంతులను నిర్మించాలి.

గాంధీజీ చెప్పిన సిద్ధాంతానికి వ్యతిరేకమైనా సరే ప్రతి నగరంలోనూ, ప్రతి గ్రామంలోనూ, ప్రతి మతానికీ, ప్రతి కులానికీ విడివిడిగా కాలనీలను నిర్మించాలి. ప్రతి ఇల్లూ సర్కారువారే ఉచితంగా నిర్మించాలి. ఆ ఇంటికి సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. ప్రతి ఒక్కరికీ ఉచితంగా బియ్యం, పప్పు, ఉప్పు, నూనె, నెయ్యి, గ్యాస్ ఇవ్వాలి.

ఓటింగ్ హక్కు వున్న ప్రతివారికి, ఓటు వేసిన ప్రతివారికీ నెలకు అయిదువేల రూపాయల చొప్పున భృతి చెల్లించాలి. అప్పుడే ఓటుహక్కును అందరూ వినియోగించుకుంటారు. పనిమీద పట్టణానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అల్పాహారం, భోజనం ఉచితంగా అందజేయాలి. అందుకు విరివిగా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి.

బ్రహ్మచారులకు, పెళ్ళిళ్ళకు, సీమంతాలకు, బారసాలలకు, అక్షరాభ్యాసాలకు, చదువులకు ప్రత్యేక ధనసహాయం చేయాలి. ఉద్యోగాలకు కులాలవారీగా, మతాలవారీగా వందశాతం రిజర్వేషన్ ఏర్పాటు చేయాలి. అందుకు రాజ్యాంగాన్ని సవరించాలి.

ఎన్నికలు ప్రకటించాక ఉచితంగా మద్యం, మాంసం సరఫరా చేయాలి. అందువలన పార్టీలకు ఎన్నికల ఖర్చు కలసి వస్తుంది. ఆ తరువాత మద్యాన్ని, మాంసాన్ని సబ్సిడీ ధరలకు సరఫరా చేయాలి.

ఉచితంగా అన్నీ అందుకున్న తర్వాత రోగాలు రాకుండా ఉంటాయా? అందుకే అన్ని రోగాలకు చికిత్సా సౌకర్యం ఉచితంగా అందచేయాలి. అన్ని వైద్యశాలలను ఉచిత వైద్యశాలలుగా మార్చాలి. కర్మకాలి మరణిస్తే అంత్యక్రియలు వగైరా ఉచితంగా చెయ్యాలి.

చైనా మనకన్నా అత్యధిక జనాభా వున్న దేశం. అయినా ఎవడిక్కావాలి? అక్కడ వస్తువులన్నీ చౌక. ప్రపంచంలో ఏ దేశంలో ధరలు తక్కువగా వుంటే ఆ దేశం నుంచి దిగుమతి చేసుకోవాలి కదా! అందుక్షే అన్ని వస్తువులు చైనా నుంచి దిగుమతి చేసుకోవాలి. మనకు నాణ్యతతో పనిలేదు. ఎలాగూ వాడుకుని పారేయడానికి అలవాటు పడ్డాము కదా!

రుణమాఫీ ఒక్క రైతులకే కాదు, అందరికీ వర్తింపచేయాలి. కొత్త రుణాలు తీసుకోవడానికి అవకాశం కల్పించాలి. మళ్లీ వాటిని మాఫీ చేయాలి. అధిక రుణం తీసుకున్న వారికి ఎగ్గొట్టే సదుపాయం కల్పించాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు 'ఒక్కసారి పెట్టుబడి' విధానాన్ని ప్రభుత్వం పాటించాలి. వారికి చాలినంత ధనాన్ని సమకూర్చాలి. తరువాత భవిష్యత్తులో వారికి ఉచితంగా ఏమీ ఇవ్వనవసరం లేదు. ఎందుకంటే విదేశాలకు వెళ్లే విద్యార్థులెవరూ స్వదేశానికి తిరిగి రావడం లేదు కనుక!

ప్రజలందరికీ ఉచితరీతిన ఉచితంగా ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్న శాసనకర్తలకు ప్రభుత్వం సముచితరీతిన ప్రతినెలా ధనాన్ని ఉచితంగా ఇవ్వాలని కోరుతున్నాం. వార్డు నాయకుల దగ్గర నుంచి దేశ నాయకుల వరకూ అందరికీ విధిగా విగ్రహాలు ఉచితంగా ఏర్పాటుచేయాలి. ఎందుకంటే అవి అభిషేకాలకు, పాలాభిషేకాలకు పాడవ్వవు కాబట్టి!

అన్నీ ఉచితంగానే ఇవ్వగానే సరిపోదు. కాలక్షేపం కావాలిగా మరి! అందుకే సెల్‌ఫోన్లూ, ఇంటర్‌నెట్ కనెక్షన్లూ ఉచితంగా అందరికీ ఇవ్వాలి. ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌లు, ట్విట్టర్లు, ఇన్‌స్టాగామ్‌లు, వీడియో కాలింగ్‌లు, చాటింగ్ వగైరాలు... వీటితో ఆడుకుంటూ, వాడుకుంటూ కాలక్షేపం చేస్తాము. మన వాళ్లను విదేశాలు ఆదరిస్తున్నాయి కదా! అందుకే విదేశీయులను మనమూ ఆదరిద్దాం. కాబట్టి మనం విదేశాల నుంచే అన్ని వస్తువులు దిగుమతి చేసుకుందాం. వారి వద్ద కొందాం. వారికే కాంట్రాక్టులు ఇద్దాం. వారిచేతే నిర్మాణాలు చేయిద్దాం. మనుషులను కూడా దిగుమతి చేసుకుందాం. వారికి ఓటుహక్కు కూడా కల్పిద్దాం.

షరాః ఈ దేశాన్ని అమ్మేసినా పర్వాలేదు, మాకు మాత్రం అన్నీ ఉచితంగా ఇవ్వాలి.

◆ రమణశ్రీ
9703222936

స్వయం సమృద్ధికి దిక్సూచి

The future of India lies in its villages-Mahatma Gandhi....ఏ దేశ భవిష్యత్తయినా అ దేశ గ్రామీణ ఆర్థిక పురోగమనంపై ఆధారపడి ఉందని చాలా సందర్భాల్లో పలువురు మేధావులు ఊటంకించారు. మన దేశానికి పల్లెలు పట్టుకొమ్మలు. ప్రజాస్వామ్య దేశంలో దాదాపు 6,49,481 గ్రామాలు ఉన్నాయి. భారత దేశం గ్రామాల సమూహం. పంచాయతి రాజ్ వ్యవస్థకై 1992లో 73వ రాజ్యాంగ సవరణ జరుగగా 1994 ఏప్రిల్ 1 నుంచి 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా లోకల్ బాడిస్ (పంచాయితిరాజ్ వ్యవస్థ)కు విశేషమైన అధికారాలు కట్టబెట్టాయి.

ఏడూ దశాబ్దాల స్వతంత్ర దేశ చరిత్రలో గ్రామీణ వ్యవస్థకు జీవంపోసే చట్టాలు, కమిటీలు, సలహాలు సూచనలు కనుచూపు మేరలో కనబడటం లేదు. ఒకవేళ ఉన్నా అవి అమలులో చాలా నిర్లక్ష్య ధోరణులు కమ్ముకున్నాయి. నాటి నుంచి నేటి వరకు సువిశాల దేశంలో సరైన అధ్యయనాలు, అభ్యసనాలు జరుగక పోవడం విచారకరం. పూర్వకాలంలో గ్రామీణ వ్యవస్థను ప్రణాళిక ప్రకారం నడిపి వివిధ దేశాల చేత అవురా అనిపించుకున్న ఘన చరిత్రకు నేడు చెదలు పడుతున్నది. స్థానిక వ్యవస్థలను కేంద్ర, రాష్ట్ర దేశ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు అవుతున్నాయని అనేక అంతర్జాతీయ, జాతీయ, స్వచ్ఛంద సంస్థలు చెపుతున్నాయి. కాని గ్రామాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగైనప్పుడు మాత్రమే మనం అనుకున్న స్థాయికి చేరుకోగలము అన్నది కాదనలేని మాట. అందుకొరకు అనేక వినూత్న, విప్లవాత్మక కార్యక్రామాలు ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు పరచవలసిన బాధ్యత పాలకులపై ఉన్నది అనేది నగ్న సత్యం. నాయకత్వం అంటే దారి పొడువునా నడవడం కాదు దారివేయడం. అందుకోసం నేడు తెలంగాణలో జరుగనున్న స్థానిక ఎన్నికలలో విజన్ ఉన్న నాయకులను గ్రామ సమస్యల మీద పట్టు ఉన్న నాయకులకును, సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోగల నాయకులను ఎన్నుకోవాలి.

తెలంగాణలో గ్రామీణ జనాభా దాదాపు 2 కోట్ల 14 లక్షలున్నది. అంటే తెలంగాణలో 61.12% జనాభా గ్రామాలలో నివసిస్తున్నారు. అత్యధిక గ్రామ పంచాయతీలు గల జిల్లాలు నల్లగొండ (844), మహబూబ్ నగర్ (721). అత్యల్ప గ్రామ పంచాయతీలు గల జిల్లాగా మేడ్చల్-మల్కాజ్‌గిరి (61). తెలంగాణ రాష్ట్ర అవిర్భావం తరువాత గ్రామాల స్వాలాంబన స్వయం సమృద్ధి చెందేందుకు ప్రణాళికలో ప్రభుత్వాలు తమ అధికారాలను ఉపయోగించి వాటిని నిర్వీర్యం చేస్తున్నవి అన్నది కాదనలేని నిజం.

> చెప్పుకోలేని శ్లోకాలెన్నో, జయించలేని వాదనలు ఎన్నో, వ్యక్తపరచలేని మాటలు ఎన్నో, పోగొట్టుకున్న బంధాలెన్నో అ బంధాల సమూహమే కుటుంబం, కుటుంబాల కలబోతే గ్రామం. చుక్కచుక్క కలిస్తే సముద్రం అవుతుంది. అదే విధంగా ప్రతి పల్లె, పల్లె స్వయం సమృద్ధి సాధిస్తే ప్రతి మండలం, ప్రతి జిల్లా అలా రాష్ట్రం మొత్తం స్వయం సమృద్ధి గల ప్రాంతంగా అభివృద్ధి చెంది దేశానికి గర్వ కారణంగా నిలవాలి.

ఒకనాడు ఈ దేశం ఉత్పాదక కులాల, జాతుల రాజ్యం. నేడు బహుళ జాతుల సంస్థల ఇనప చక్రాల కింద పడి ఆ జాతుల అన్నమో రామచంద్ర అని పట్టణం వైపు పరుగులు తీస్తున్న పరిస్థితి వచ్చింది. మనం ఇలాంటి ఉత్పాదక జాతుల సంక్షేమంపై అధ్యయనం, వారి చరిత్ర సంస్కృతి సంప్రదాయాలపై సరియైనచర్చ జరుగాలి వారి సంస్కృతి సంప్రదాయాల పునర్నిర్మాణం జరగాలి.

దేశంలో పంచాయతీరాజ్ చట్టం 1959 అక్టోబర్ 2న ప్రవేశపెట్టారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 60 ఏండ్లు అవుతున్న మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ సాధికారత, గ్రామ స్వరాజ్యం, స్వయంసమృద్ధి వైపు అడుగులు వేసున్నదా అనేది ప్రశ్నార్థకమే. బల్వంతరాయ్ మెహతా కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను మొట్టమొదట రాజస్థాన్‌లోని నౌగర్ జిల్లాలో 1959 అక్టోబర్ 2న ప్రవేశపెట్టారు. ఆ తదుపరి పంచాయతీరాజ్ వ్యవస్థను అమలుచేసిన రెండవ రాష్ట్రం మన సమైక్య ఆంధ్రప్రదేశే. ముఖ్యంగా కారణాలేవైనా తెలుగు రాష్ట్రాలలో అనుకున్నంత స్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థ అభివృద్ధి వైపు అడుగులు పడలేదు.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1964, మండల పరిషత్, జిల్లా పరిషత్తు, జిల్లా ప్రణాళిక, సమీక్ష మండలాల చట్టం-1986, స్థానిక సంస్థల ఎన్నికల సంస్కరణల చట్టం-1989 ఈ మూడు చట్టాల స్థానంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994ను అమల్లోకి తెచ్చారు. అయితే ఆ చట్టాలకు ప్రాధన్యత ఇవ్వకపోవడం వాటి అమలులో లోపాల వలన 73వ రాజ్యంగ సవరణ ద్వారా 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చినా వాటి అభివృద్ధిలో, గమనంలో పెద్దగా మార్పు లేదు.

భాగంగా 4380 నూతన గ్రామ పంచాయతీలని ఏర్పాటు చేశారు. గిరిజన గ్రామాలు, 1311 షెడ్యూల్డ్ గ్రామ పంచాయతీలు కలవు రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం మొత్తం 12741 గ్రామపంచాయితీలు, 113270 వార్డులు కలవు. నేడు ఆ గ్రామీణ వ్యవస్థకు మొట్టమొదటి సారిగా ఎన్నికలు నిర్వహిస్తున్నందున ప్రజలు జాగారుకతతో స్థానిక ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలి.

మనరాష్ట్రంలో 1959 పంచాయతీరాజ్ వ్యవస్థ నవంబర్ 1న నాటి మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో అమలుకు శ్రీకారం చుట్టారు. పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లోకి వచ్చి సుమారు అరు దశాబ్దాలు అవుతున్న గ్రామ స్వరాజ్యం, గ్రామ సాధికారత స్వయం సమృద్ధి చేయడం కోరకు వాటిని అర్థికంగా బలం చేకూర్చేందుకు అనేక చట్టాలు, కమిటీలు, సూచనలు, ఏర్పాటు చేసిన అవి కాగితాలకే పరిమితం అయ్యాయి. గ్రామ స్వరూపాలు మారకపోగా వాటి నిర్వహణ చట్టాల అమలు నిర్వీర్యమవుతూ వచ్చాయి.

మనం తరచుగా అనేక సందర్భాలలో చర్చించు కుంటుంటాం పోలీస్ పటేల్, కరుణం, పటేల్ పట్వారి, మాల్ పటేల్ నుండి మనలో ఒకరు మనల్ని పరిపాలించే గ్రామీణ వ్యవస్థలో మనం ఈ వ్యవస్థకు మనం ఏ విధంగా సహాయం అందించాలి అని. మన ప్రాంతం అభివృద్ధి చెందకపోవడానికి మన నాయకులే కారణం. నేడు గ్రామ పంచాయతీలు ఎన్నికల జరుగుతున్న సందర్భంగా మనం సరైన ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలి. అందుకొరకే A genuine leader is not a searcher for consensus but a molder of consensus." -Martin Luther King Jr.

గ్రామాలలో ప్రజలకు కావాల్సిన మౌలిక అంశాలు/అవసరాలు (తాగు, సాగునీరు, రోడ్లు, మురుగునీరు, పాఠశాలలు, గ్రంథాలయం, గ్రామ సచివాలయం, పచ్చదనం, వ్యవసాయం, విద్యుత్తు, ఆసుపత్రి మహిళాసాధికారత) ఇలా అనేక అంశాలపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి గ్రామీణ వ్యవస్థను పునర్ నిర్వహించవల్సిన అవసరమున్నది.

అధికార వికేంద్రీకరణ: రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో చిన్నచిన్న విషయాలలో, అధికారుల విధులలో తలదూర్చకుండా స్థానిక సంస్థల అధికారాలను గౌరవించి, స్వేచ్ఛ కలిపించి వాటి విధులను అవి నిర్వహించేలా అధికార వికేంద్రీకరణ (వార్డు మెంబర్, సర్పంచ్, యంపిటిసి, జడ్‌పిటిసి) చేయాలి.

పరిశ్రమల వికేంద్రికరణ: రాష్ట్ర ప్రభుత్వం పట్టణ, నగర, జిల్లా కేంద్రాలలో, రాజధానిలో మాత్రమే పరిశ్రమలు, ప్రతి ష్టాత్మక ప్రాజెక్టులు, ఐటి సంస్థలు స్థాపిస్తోంది. అలా కాకుండా పల్లె ప్రాంతాలలో పరిశ్రమలు స్థాపించాలి. నేడు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న జనాభా పట్టణాలకు తరలిపోకుండా ప్రజలకు ఉపాది అవకాశాలు కల్పించాలి.

త్రాగు నీరు: మనదేశంలో అంతర్జాతీయ సంస్థల లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంత ప్రజలకు 7% మాత్రమే సురక్షిత మంచినీరు అందుతోంది. తెలంగాణలో మిషన్ భగీరథ పేరుతో ప్రతి పల్లెలో మంచినీరు అందించే ప్రయత్నం చేసున్నది, కాని ఇప్పటికి ఫ్లోరైడ్ భూతం మనల్ని కబళిస్తోంది. ప్రతి గ్రామంలో నీటి ట్యాంకును నిర్మించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీరు అందిచాల్సిన ప్రాథమిక కర్తవ్యం ప్రజా ప్రతినిధులది.

సాగునీరు: కాకతీయుల కాలం చెరువుల (గొలుసు కట్టు) ద్వారా వ్యవసాయానికి ప్రసిద్ధి. కాని నేడు అది చరిత్రగా చెప్పుకుంటున్నారు. చెరువులు నింపాలని మన రాష్ట్రంలో మిషన్ కాకతీయ పేరుతో ప్రతి పల్లెలో సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నది. అయితే ప్రతి చెరువును నింపాలి. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరద నీటిని చెరువులకు, కుంటలకు పారే ప్రయత్నం చేయాలి. దాని వలన భూగర్భనీటి మట్టం పెరుగుతుంది. ప్రతి సంవత్సరం ఇంటికి ఒక్కరు చొప్పున వచ్చి చెరువు పూడికను తీయాలి (ప్రజలు ప్రభుత్వం కలసి చేయవలసిన పని). చెరువులకు జలకళ రావాలి.

విద్యుత్తు: ప్రతివీధిలో రాత్రి వేళల్లో లైట్లను ఏర్పాటు చేయాలి. ప్రతి ఊరిలో గ్రామ సచివాలయం నిర్మించాలి. ప్రతినెలా గ్రామ సమస్యలపై చర్చ, పరిష్కారం జరగాలి.

మురుగునీరు: పక్కా ప్రణాళిక కలిగిన మురుగునీటి వ్యవస్థ ఉండాలి. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వాడిన నీటిని వృధా పోనివ్వకుండా ఇంకుడు గుంతలకు వెళ్ళే ప్రయత్నం చేయాలి. అలా చేయడం వలన భూగర్భ నీటిమట్టం పెరుగుతుంది.

మరుగుదొడ్డి: ప్రతి ఇంట్లో మరగుదొడ్డి నిర్మించేందుకు సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటులను వారికి అందించాలి.

రవాణా సదుపాయాలు: గ్రామాలలో ప్రతి వీధిలో పక్కారోడ్లు (సిమెంటు) వేయించాలి. వివిధ గ్రామాలతో పట్టణ, నగర ప్రాంతాలతో కలుపుతూ పక్కారోడ్లు ఏర్పాటు చేయాలి. అందుకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ పథకాలతో, నిధులతో నిర్వహించాలి.

ఆస్పత్రి: ప్రతి గ్రామంలో ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నిత్యం డాక్టర్లు అందుబాటులో ఉండే ప్రయత్నం చేయాలి. అంగన్‌వాడి అయాలను అందుబాటులో ఉంచాలి. ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వాహించాలి.

గ్రంథాలయం: ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన సమాచారం, వ్యవసాయం సంబంధించిన సమాచారం గ్రామీణ ప్రాంత సమాచారం అందుబాటులో ఉంచాలి.


పాఠశాల: ప్రతి గ్రామంలో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలి. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన ఏర్పాటు చేయాలి. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరిని చదివించే ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా మహిళలు ఆక్షరాస్యత సాధించినప్పుడే గ్రామం స్వయంసమృద్ధి చెందుతుంది.

వ్యవసాయం: ఆ గ్రామంలోని భూమిని వివిధ నూతన పద్ధతుల ద్వారా పరిక్షలు నిర్వహించి ఏ పంటకు అనుకూలమో నిర్ధారించి సహజ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని చేయాలి. ఆర్గానిక్ ఎరువుల, కంపోస్ట్ ఎరువుల ద్వారా సహజ సిద్ధంగా నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా అధిక లాభాలను అర్జించే విధంగా వ్యవసాయం చేయాలి.

పచ్చదనం: మన రాష్ట్రంలో అడవులు 24.35% మాత్రమే ఉన్నాయి. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి ముందు చెట్లు పెంచాలి. బంజరు భూమిలో సామాజిక అడవులను పెంచి హరితహారానికి శ్రీకారం చుట్టాలి.

కులవృత్తులు: కులవృత్తులకు తిరిగి ప్రాణం పోయడానికి కుల వృత్తులను నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా బలోపేతం చేయాలి. ఉత్పాదక కులాలకు సంబంధించిన వివిధ పథకాల మీద చట్టాల మీద చర్చ జరగాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన పథకాల మీద అవగాహన సక్రమంగా వినియోగం అయ్యేలా ప్రయత్నం చేయాలి .

యువత మహిళా సాధికారత: యువకులకు, మహిళా సాధికారత సాధించే దిశగా అడుగులు వేయాలి. వారికి డ్వాక్రా గ్రూపులకు బ్యాంకు రుణాలు ఇప్పించాలి. చిన్న తరహా పరిశ్రమలకు సదుపాయాలు ప్రభుత్వం కల్పించి స్వయం ఉపాధి కలిపించే ప్రయత్నం చేయాలి. పాడిపరిశ్రమ ద్వారా, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల ద్వారా యువకులకు, మహిళలకు సహాయం అందించాలి. యువకులు పట్టణ ప్రాంతాలకు ఉపాధి కోసం తరలి పోకుండా గ్రామాలలో ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నం చేయాలి.



సమర్థులెప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులు అవుతారని వివేకానంద చెప్పినట్లు పైన చెప్పిన మౌలిక అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన పథకాల ద్వారా గాని, నిధుల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరే ప్రయత్నం చేయాలి. నేడు రానున్న గ్రామ ప్రజా ప్రతినిధులు నూతన ప్రణాళికలు రూపొందించి ప్రణాళిక ప్రకారం, గ్రామ కమిటిల ద్వారా గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాల్సిన అవసరం ఉన్నది. అందుకోసం నూతన గ్రామ ప్రజాప్రతినిధులకు ప్రతి అంశంపై శిక్షణ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహించాలి.

చెప్పుకోలేని శ్లోకాలెన్నో, జయించలేని వాదనలు ఎన్నో, వ్యక్తపరచలేని మాటలు ఎన్నో, పోగొట్టుకున్న బంధాలెన్నో అ బంధాల సమూహమే కుటుంబం, కుటుంబాల కలబోతే గ్రామం. చుక్కచుక్క కలిస్తే సముద్రం అవుతుంది. అదే విధంగా ప్రతి పల్లె, పల్లె స్వయం సమృద్ధి సాధిస్తే ప్రతి మండలం, ప్రతి జిల్లా అలా రాష్ట్రం మొత్తం స్వయం సమృద్ధి గల ప్రాంతంగా అభివృద్ధి చెంది దేశానికి గర్వ కారణంగా నిలవాలి.

◆ డాక్టర్ రవి కుమార్ చేగొని
ప్రధాన కార్యదర్శి,
తెలంగాణ గ్రంథాలయ సంఘం, హైదరాబాదు.

అదరగొట్టిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

- క్యూ3లో నికర లాభం 20 శాతం జంప్
- రూ.5,586 కోట్లుగా నమోదు
- 22 శాతం పెరుగుదలతో రూ.12,576 కోట్లకు నికర వడ్డీ ఆదాయం



న్యూఢిల్లీ: దేశీ ప్రైవేట్ రంగ దిగ్గజమైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో (క్యూ3, అక్టోబర్-డిసెంబర్) త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఏకంగా 20.3 శాతం మేర పెరిగింది. అధిక వడ్డీ ఆదాయం, ఇతర ఆదాయం పెరుగుదల ఇందుకు కారణం.

బ్యాంక్ నికర లాభం ప్రస్తుత క్యూ3లో రూ.5,586 కోట్లుగా నమోదయ్యింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో బ్యాంక్ నికర లాభం రూ.4,642 కోట్లుగా ఉంది. కాగా మార్కెట్ వర్గాలు బ్యాంక్ నికర లాభం ఈ క్యూ3లో రూ.5,603 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశాయి.

బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన ఏకంగా 22 శాతం పెరుగుదలతో రూ.12,576 కోట్లకు చేరింది. రుణాలపై అర్జించిన వడ్డీలో నుంచి డిపాజిట్లకు వడ్డీ రూపంలో చెల్లించిన మొత్తాన్ని తీసివేస్తే మిగిలేదే నికర వడ్డీ ఆదాయం. బ్యాంక్ రుణ నాణ్యత స్థిరంగానే కొనసాగుతోంది. స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 1.38 శాతంగా నమోదయ్యాయి. సెప్టెంబర్ క్వార్టర్‌లో ఇవి 1.33 శాతంగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో స్థూల మొండిబకాయిలు 1.29 శాతంగా నమోదయ్యాయి. మొండి బకాయిల కేటాయింపులు వార్షిక ప్రాతిపదికన 64 శాతం పెరుగుదలతో రూ.2,211 కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో కేటాయింపులు రూ.1,351 కోట్లుగా ఉన్నాయి.

బ్యాంక్ బ్యాలెన్స్ షీటు పరిమాణం డిసెంబర్ 31 చివరి నాటికి రూ.11,68,556 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంక్ బ్యాలెన్స్ షీటు పరిమాణం రూ.9,49,079 కోట్లుగా ఉంది. కాసా రేషియో 40.7 శాతంగా ఉంది.

బంగారం జోరుకు బ్రేకులు

రెండో రోజు తగ్గిన బంగారం ధర

- రూ.60 క్షీణించిన 10 గ్రాముల పసిడి ధర
- దీంతో రూ.33,160కు తగ్గుదల
- కేజీ వెండి ధర రూ.280 డౌన్

న్యూఢిల్లీ: పసిడి ధర మళ్లీ తగ్గింది. దేశీ మార్కెట్‌లో వరుసగా రెండో రోజు బంగారం ధర క్షీణించింది. పది గ్రాముల బంగారం ధర రూ.60 క్షీణతతో రూ.33,160కు తగ్గింది. దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ నెమ్మదించడం ఇందుకు కారణం. అదేసమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ట్రెండ్ బలహీనంగా ఉండటం కూడా దేశీయంగా ధరలపై ప్రభావం చూపింది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా తగ్గాయి. కేజీ వెండి ధర రూ.280 తగ్గుదలతో రూ.40,100కు క్షీణించింది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ తగ్గడం ఇందుకు కారణం.

ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితులు, దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ తగ్గడం వంటి అంశాలు బంగారంపై నెగటివ్ ప్రభావం చూపాయని ట్రేడర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 0.77 శాతం క్షీణతతో 1,282.55 డాలర్లకు, వెండి ధర ఔన్స్‌కు 1.26 శాతం క్షీణతతో 15.41 డాలర్లకు తగ్గింది.

ఢిల్లీలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.60 తగ్గుదలతో రూ.33,160కు, 22 క్యారెట్ల బంగారం ధర రూ.60 తగ్గుదలతో రూ.33,010కు క్షీణించింది. కాగా బంగారం ధర శుక్రవారం రూ.80 తగ్గింది. ఇక ప్రభుత్వ సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర స్థిరంగా రూ.25,500ల వద్ద కొనసాగుతోంది. కేజీ వెండి ధర రూ.280 తగ్గుదలతో రూ.40,100కి క్షీణిస్తే.. వారాంతపు ఆధారిత డెలివరీ ధర రూ.382 తగ్గుదలతో రూ.39,198కి క్షీణించింది. ఇక 100 వెండి నాణేల కొనుగోలు, అమ్మకం విషయానికి వస్తే.. కొనుగోలు ధర రూ.77,000 ఉండగా.. అమ్మకం ధర రూ.78,000గా స్థిరంగా కొనసాగాయి.



విప్రోకు లాభాల జోరు

న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ కంపెనీ విప్రో ఇవాళ అక్టోబరు-డిసెంబరు 2018 త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. సంస్థ ఏకీక త నికర లాభం రూ.2,544.5కోట్లకు పెరిగిందని తెలిపింది. గతంలోని ఇదే త్రైమాసికంతో



పోలిస్తే 31.8శాతం పెరిగినట్లు వెల్లడించింది. 2017 డిసెంబరుతో ముగిసే త్రైమాసికంలో కంపెనీ రూ.1930.1కోట్ల ఏకీక త నికర లాభం సాధించింది. కంపెనీ లాభాలు సాధించిన సందర్భంగా కంపెనీ బోనస్ షేర్లను ఆఫర్ చేసింది. మూడు షేర్లు ఉన్న షేర్‌హోల్డర్‌కు ఒక బోనస్ షేరు ఇస్తున్నట్లు తెలిపింది. విప్రో కార్యకలాపాల ఆదాయం గతంతో పోలిస్తే 10.17శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. 2017 డిసెంబరు త్రైమాసికంలో ఈ ఆదాయం రూ.13,669కోట్లు కాగా, 2018 డిసెంబరు నాటికి ముగిసిన త్రైమాసికంలో రూ.15,059.5కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. ఐటీ సేవల నుంచి రూ.14,555కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించింది. వ్యూహాత్మక పెట్టుబడులు, వినియోగదారులతో చక్కని సంబంధాలు తదితర అంశాల కారణంగా గడిచిన త్రైమాసికం చాలా సంత ప్తికరంగా ఉందని విప్రో సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి తెలిపారు.

పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలు

న్యూఢిల్లీ: దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపు కొనసాగుతోంది. ముడి చమురు ధరల పెరుగుదల, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడుతున్న నేపథ్యంలో ప్రధాన చమురు కంపెనీలు ఇంధన ధరలను పెంచుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకారం.. శనివారం ప్రధాన నగరాల్లో లీటరు పెట్రోల్ ధర 17-20 పైసలు పెరగగా, లీటరు డీజిల్ ధర 20పైసల దాకా పెరిగింది. దిల్లీలో నేడు లీటరు పెట్రోల్ ధర 17 పైసలు పెరిగి రూ.70.72కు చేరింది. డీజిల్ ధర 19 పైసలు పెరిగి రూ.65.16గా ఉంది.

హైదరాబాద్‌లో లీటరు పెట్రల్ ధర రూ.75.03గా, లీటరు డీజిల్ ధర రూ.70.83గా ఉంది. ముంబయిలో లీటరు పెట్రోల్ ధర 17 పైసలు పెరిగి రూ.76.35గా, డీజిల్ ధర 20పైసలు పెరిగి రూ.68.22గా ఉన్నాయి. బెంగళూరులో పెట్రోల్ ధర రూ.73.05గా, డీజిల్ ధర రూ.67.10గా ఉన్నాయి. చెన్నైలో పెట్రోల్ ధర రూ.73.41గా, డీజిల్ ధర రూ.68.82కు చేరింది. కోల్‌కతాలో పెట్రోల్ ధర



రూ.72.82కు, డీజిల్ ధర రూ.66.94కు చేరింది. అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో దేశీయంగా కూడా చమురు ధరలు పెరుగుతున్నాయి. 2019 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పెట్రోల్ ధర లీటరుకు రూ.1.82పైసలు, డీజిల్ ధర రూ.2 దాకా పెరిగాయి.

ఎల్‌అండ్‌టీకి సెబీ నో

ముంబయి: ఇంజినీరింగ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీకి సెబీలో నిరాశ ఎదురైంది. రూ.9,000 కోట్ల మేరకు షేర్లను బైబ్యాక్ చేయాలన్న ఎల్‌అండ్‌టీ నిర్ణయానికి అనుమతులిచ్చేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిరాకరించింది. ఈ విషయాన్ని ఎల్‌అండ్‌టీ స్టాక్ ఎక్స్ఛేంజీకి అందజేసిన ఫైలింగ్‌లో పేర్కొంది. బైబ్యాక్ ఆఫర్ సెబీ, కంపెనీ చట్టంలోని నిబంధనలకు అనుకూలంగా





లేదని అధికారులు పేర్కొన్నారు.

ఎల్‌అండ్‌టీ మొత్తం 6.1కోట్ల షేర్లను బైబ్యాక్ చేయాలని భావించింది. ఒక్కో షేరుకు రూ.1,475 చెల్లించాలని నిర్ణయించింది. ఈ లెక్కన ఈ బైబ్యాక్ విలువ రూ.9,000 కోట్లుగా లెక్కగట్టింది. అక్టోబర్ 15నాటికి ఈ కంపెనీ షేర్లను కలిగి ఉన్నవారు ఈ బైబ్యాక్‌కు అర్హులుగా పేర్కొంది. కానీ ఇప్పుడు సెబీ ఎల్‌అండ్‌టీ నిర్ణయానికి బ్రేకులు వేసింది.

ఇంటి రుణానికి ఉండాలి..స్కోర్

వ్యక్తిగత రుణం, బైకు, కారు, టీవి, ఏసి, ఎడ్యుకేషనల్ లోన్ వంటి వస్తువుల కొనుగోలు రుణాలకు మాత్రమే క్రెడిట్ స్కోర్ ప్రామాణికం, కానీ ఇంటి రుణాలకు సిబిల్‌స్కోర్‌తో పెద్దగా పట్టింపు ఉండదనుకుంటారు చాలామంది. కానీ, ఆర్థిక సంస్థల నుంచి ఎలాంటి రుణం కావాలన్నా.. వ్యక్తిగత సిబిల్ స్కోర్ స్థితిపైనే రుణం ఇవ్వడం, ఇవ్వకపోవడం అనేది ఆధారపడి ఉంటుందనేది చాలా మందికి తెలియదు. ఇందులో గృహరుణాలూ ఏమాత్రం మినహాయింపు కాదు. రుణం తీసుకునే ఇంటికి సంబంధించిన పత్రాలను.. బ్యాంకులు గ్యారంటీగా తనఖా రూపంలో పెట్టుకుంటారు కనుక.. రుణం ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరాలూ ఉండవనే తర్కం కూడా ఖాతాదారుల్లో ఉంటుంది. కానీ అది సరికాదు. రుణం చిన్నదైనా.. పెద్దదైనా.. రూపం ఏదైనా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇచ్చే క్రెడిట్ స్కోర్‌పైనే ఆధారపడి ఉంటుంది. అందుకే, గ హరుణాలపై ఆసక్తి ఉన్నవారికి సిబిల్‌స్కోర్ పట్ల అవగాహన ఉండాలి. అందుకు కావాల్సిన ముందస్తు వ్యూహరచన చేయాలి

ఇప్పుడు సొంతిల్లు కల నెరవేర్చుకునే విషయంలో చాలామంది బ్యాంకు రుణాలు ఆశ్రయిస్తున్నారు. ఇందులో ధనికవర్గాల మొదలుకుని, మధ్యతరగతి ప్రజలూ బ్యాంకులు ద్వారా గ హరుణాలు పొందడానికి అనేక అవకాశాలు తలుపు తడుతున్నాయి. అయితే, రుణం తీసుకునే ముందు మన సామర్థ్యాన్ని బట్టి ఎంత రుణం రావచ్చు? బ్యాంకులు, రుణ సంస్థలు మనల్ని ఎలా అంచనా వేస్తాయి? మన బ్యాంకుకు అర్జీగా పెట్టే దరఖాస్తులను ఎలా పరిశీలిస్తాయి ? ఇలా అనేక విషయాలపై అవగాహన ఉంటేనే.. రుణగ్రహీతలు కాగలం. లేదంటే.. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరించే ప్రమాదం ఉంది. అలాంటి ప్రమాదానికి ముఖ్యమైన కారణాల్లో 'సిబిల్ స్కోర్' స్థితి కూడా ఒకటి.

ఇల్లు అలకగానే పండగ కాదు.. అనేది లోకోక్తి. నిజమే.. ఇంటి రుణాల విషయంలోనూ దీన్ని అన్వయించుకోవచ్చు. ఎందుకంటే.. సొంతింటి కల అనేది ప్రతి ఒక్కరి కల. అయితే ఆ కల కలగానే మిగిలిపోకుండా ఉండాలంటే.. అందుకు ముందుగానే ఆయుధ సామాగ్రిని సిద్ధం చేసుకోవాలి. బలోపేతం కావాలి. అంటే, తీసుకునే రుణం చెల్లింపు సామర్థ్యం నుంచి



ఆర్థికసంస్థలతో సానుకూలమైన లావాదేవీల నిర్వహణ అలాగే ఇంటి స్థలం, పత్రాలు, న్యాయపరమైన అంశాలు అన్నీ సజావుగా ఉండేలా జాగ్రత్తపడాలి.

ఇంటి పత్రాల పరిశీలన

రుణాన్ని ఇచ్చేముందు సంస్థలు ముందుగా పరిశీలించేది మనం కొనాలనుకుంటున్న ఇంటికి సంబంధించిన పత్రాల్ని. ఎంపిక చేసుకున్న ఇల్లు అన్ని అనుమతులకూ లోబడి నిర్మించారా? లేదా? అనే దానితోపాటు, ఇతర అంశాలనూ పరిశీలిస్తాయి. ఇవన్నీ సరిచూసుకున్నాక, బ్యాంకులకు ఎలాంటి అభ్యంతరం లేకపోతే.. అప్పుడు ఆదాయానికి సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తారు. దీనికోసం కనీసం ఆరు నెలల వేతనం వివరాలు, గత మూడేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు అవసరం అవుతాయి. ఇతర పత్రాలు అంటే పుట్టిన తేదీ ధ్రువీకరణ, ప్రస్తుత చిరునామా, శాశ్వత చిరునామా, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాల్లాంటివీ అవసరం. రుణం తీసుకోబోయే ఈ పత్రాలకు సంబంధించి పట్టికలాంటిది తయారుచేసుకొని, అందులో ఒక్కోదాన్నీ సరిచూసుకోవాలి. అన్ని పత్రాలనూ ముందే సిద్ధం చేసుకోవడం వల్ల చివరి నిమిషంలో హడావుడి తప్పుతుంది.

గత రుణాల చరిత్ర

ఈ రోజుల్లో వాహన, వ్యక్తిగత రుణాల్లాంటివి తీసుకోవడం సర్వసాధారణం. గ హరుణం తీసుకునేటప్పుడు అలాంటివి ఏమైనా ఉంటే బ్యాంకుకు తెలియజేయాలి. అలాంటి రుణాలకు నెలకు ఎంత మొత్తం నెలసరి వాయిదాలు చెల్లిస్తున్నారో అనే సంగతి గ హరుణ దరఖాస్తు పత్రంలో ముందుగానే పేర్కొంటే మంచిది. ప్రాథమికంగా మనం ఇచ్చే సమాచారాన్నిబట్టే సదరు వ్యక్తికి ఎంత వరకు రుణం ఇవ్వొచ్చు అనే విషయంలో బ్యాంకులు ఒక అంచనాకు వస్తాయి.

క్రెడిట్ స్కోర్‌పై ఆరా!

కొత్తగా రుణం రావాలంటే.. మంచి క్రెడిట్ స్కోరు, రుణ చరిత్ర, ఆదాయం అన్నీ సరిగ్గా ఉండాలి. అంతమాత్రాన రుణం కచ్చితంగా వస్తుందనీ చెప్పలేం. ఆదాయంతో పోలిస్తే.. అప్పులు తక్కువగా ఉండాలి. అప్పుడే అనుకున్న రుణం దొరుకుతుంది. రుణాలు, క్రెడిట్ కార్డులు ఇచ్చేప్పుడు బ్యాంకులు రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరును క్షుణ్ణంగా గమనిస్తాయి. ఆ విషయాలనే పరిగణనలోకి తీసుకుంటాయి.

రుణ చెల్లింపులో క్రమశిక్షణ ఉన్న ఖాతాదారులకు ఎలాంటి అభ్యంతరాలూ పెట్టకుండా బ్యాంకులు సులభంగా అప్పులు ఇస్తుంటాయి. ఎంత ఎక్కువ స్కోరు ఉంటే.. రుణం వచ్చే అవకాశాలు అంత బాగుంటాయి. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన మరో అంశం ఏమిటంటే.. అప్పు ఇవ్వాలా? వద్దా? అనేది పూర్తిగా బ్యాంకు విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. కేవలం సిబిల్ స్కోరు ఒక్కటే ఆధారంగా చేసుకొని, బ్యాంకు అప్పు ఇవ్వాలా? వద్దా? అనేది నిర్ణయించదు.

మెరుగైన సిబిల్‌స్కోర్ కోసం

రుణం తీసుకోవాలనుకున్నప్పుడు.. సిబిల్ స్కోరు, రుణ చరిత్ర మెరుగ్గా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే తీసుకున్న రుణాలకు సంబంధించిన ఈఎంఐలను (నెలసరి రుణ చెల్లింపులు), క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించడం ఎప్పుడూ మర్చిపోకూడదు. బిల్లులు సరిగ్గా చెల్లించకపోతే.. క్రెడిట్ స్కోరు తగ్గిపోతుంది. ఇది చివరకు అవసరం అయినప్పుడు రుణం రాకుండా చేస్తుంది.

గృహరుణం తీసుకోవాలనే ఆలోచన వచ్చిన తర్వాత, సిబిల్ ట్రాన్స్ యూనియన్ స్కోరు, రుణ చరిత్రను సొంతంగా తెప్పించుకోవడం మంచిది. దీనివల్ల రుణ చరిత్ర నివేదికలో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకునేందుకు వీలవుతుంది. ఇలాంటి ముందస్తు అవగాహన ఏర్పరచుకుని.. గ హరుణం కోసం ప్రయత్నిస్తే.. ఎలాంటి అడ్డంకులూ ఉండవు. ఆర్థికసంస్థలూ గతంలోలా.. రిస్క్ తీసుకోవడానికి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. అందుకే మెరుగైన స్కోర్ ఉండేలా జాగ్రత్తపడాలి!

క్రెడిట్ స్కోర్ పెంచే.. క్రెడిట్ కార్డ్‌లు

క్రెడిట్ కార్డ్‌లవల్ల లాభం, నష్టాలను పక్కనపెడితే.. క్రెడిట్ కార్డ్‌ల నిర్వహణ కూడా సిబిల్ స్కోర్ మెరుగ్గా ఉండేందుకు దోహదపడతాయి. అయితే కార్డులను సరియైన రీతిలో వినియోగిస్తూ ఎప్పటికప్పుడు చెల్లింపులు, వాయిదాలు సజావుగా సాగితేనే ఆయా కార్డులవల్ల మేలు జరుగుతుంది. లేదంటే సిబిల్‌స్కోర్ తగ్గే ప్రమాదమూ ఉంది. ఈరోజుల్లో స్థిరంగా ఆరునెలలు, ఒక ఏడాదిపాటు సేవింగ్స్ ఎకౌంట్ స్థిరంగా నిర్వహణలో ఉంటే.. బ్యాంకులే స్వయంగా క్రెడిట్ కార్డ్స్ తీసుకోమని అడుగుతుంటాయి. అందివస్తున్నాయి కదా అని, అలా క్రెడిట్ కార్డులు తీసుకోగానే సరిపోదు. గడువులోపు వాటికి బిల్లులు చెల్లించాలి. లేకపోతే.. అసలు కన్నా వడ్డీ మించిపోతుంది. అయితే, క్రెడిట్ కార్డ్ బిల్లులు, చెల్లింపులు పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటే మెరుగైన క్రెడిట్‌స్కోర్ రాబట్టవచ్చు.

- గోల్డ్, సిల్వర్, టైటానియం, ప్లాటినం.. ప్రధానంగా వివిధ బ్యాంకులు అందించే క్రెడిట్‌కార్డు రకాలు. వీటిలో ఏది ఎంచుకోవాలన్నది.. మన చెల్లింపు సామర్థ్యం, అవసరాలు, ఖర్చుచేసే పద్ధతిని బట్టే ఆధారపడి ఉంటుంది.
- బిల్లు చెల్లించడానికి 45-55 రోజుల వరకు సమయం ఉంటుంది. అంటే ఈ వ్యవధిలోపు బిల్లు మొత్తం చెల్లిస్తే ఎలాంటి వడ్డీ విధించరు. మొత్తం బిల్లు కాకుండా, కనీస మొత్తమే చెల్లిస్తే.. మిగిలిన బాకీపై నెలకు 2.9 శాతం నుంచి 3.5 శాతం వరకు వడ్డీ విధిస్తారు.
- కార్డు బిల్లుల చెల్లింపునకు ఎలక్ట్రానిక్ క్లియర్ సిస్టమ్ (ఈసీఎస్)ను వాడుకోవచ్చు. దీనివల్ల గడువు తేదీ రాగానే క్రెడిట్‌కార్డు సంస్థలు మీ బ్యాంకు ఖాతాలోంచి సొమ్మును తీసుకుంటాయి. ఫలితంగా చెల్లింపుల్లో ఆలస్యం వంటి సమస్యలు ఉత్పన్నం కావు.
- క్రెడిట్‌కార్డు ఉపయోగించి ఏటీఎంల నుంచి నగదు తీసుకోవచ్చు. మరే మార్గం లేనప్పుడు మాత్రమే ఈ సౌకర్యాన్ని వినియోగించుకోండి. కార్డుతో తీసుకునే నగదుపై ఏడాదికి 36 నుంచి 49 శాతం వడ్డీ కట్టాల్సి వస్తుంది. బకాయి పడితే రెండేళ్లలోనే బాకీ రెట్టింపు అవుతుందని గుర్తుంచుకోండి.
- వేర్వేరు బ్యాంకులకు చెందిన రెండు కార్డులు వాడుతుంటే.. ఒక కార్డుపై కట్టాల్సిన బాకీని, తక్కువ వడ్డీరేటు ఉండే మరో కార్డుకు బదిలీ చేసుకుంటే మంచిది. అలాగే రెండోకార్డుపై వడ్డీ లేని నిర్ణీత కాల వ్యవధిని వినియోగించుకోవాలి. బ్యాంకులు క్రెడిట్‌కార్డుల చెల్లింపుల్లోనూ ఈఎంఐ విధానాన్ని అందిస్తున్నాయి. కనీస మొత్తం చెల్లించడంకన్నా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడం మంచిదే.





'ఎఫ్ 2' సక్సెస్‌మీట్

విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరో హీరోయిన్స్‌గా నటించిన చిత్రం 'ఎఫ్ 2.. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్'. దిల్‌రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్, లక్ష్మణ్ సినిమాను నిర్మించారు. అనీల్ రావిపూడి దర్శకుడు. శుక్రవారం ఈ చిత్రం సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనీల్ రావిపూడి మాట్లాడుతూ ''ఈ సంక్రాంతికి ఎస్.వి.సి బ్యానర్‌లో మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చిన దిల్‌రాజుగారికి, శిరీష్‌గారికి, లక్ష్మణ్‌గారికి థాంక్స్. మంచి ట్యూన్స్, బ్యాగ్రౌండ్ స్కోర్ ఇచ్చిన దేవిశ్రీ ప్రసాద్‌గారికి థాంక్స్. వెంకటేష్‌తో వరుణ్‌తేజ్ చేసిన కామెడీ, సూపర్బ్ పెర్ఫామెన్స్ చేశాడు. నాపై నమ్మకంతో సినిమా చేసినందుకు వెంకటేష్‌గారికి థాంక్స్. కామెడీ చేయడంలో వెంకటేష్‌గారికి మనం చెప్పేదేముండదు. ఆయనొక లైబ్రరీ. అందులో ఏరుకోవడమే. నా లైఫ్‌లో ఈ సంక్రాంతి నవ్వుల సంక్రాంతి. జీవితాంతం గుర్తుండిపోయే సంక్రాంతి. ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చినందుకు ప్రేక్షకులకు థాంక్స్'' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''మా సినిమాకు ఎఫ్ 2 అనే టైటిల్ పెట్టి అనీల్ అనౌన్స్ చేసి వీ 2(వెంకటేష్, వరుణ్‌తేజ్)గా ఇద్దరు హీరోలు జాయిన్ అయ్యారు. సినిమా ఈ2(ఎంటర్‌టైన్‌మెంట్, ఎంటర్‌టైన్‌మెంట్) అని మెసేజ్‌లు పెట్టారు. చివరకు బీ 2(బొమ్మ బ్లాక్‌బస్టర్) అనేశారు. ఇంత మంచి ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ చేసిన అనీల్‌కు థాంక్స్. మా టీం అందరం ఎంజాయ్ చేస్తున్నాం. వెంకటేష్, వరుణ్ అద్భుతంగా చేశారు. సక్సెస్‌లో భాగమైన నటీనటులు, టెక్నీషియన్స్‌కు థాంక్స్. సినిమా హిట్ అవుతుందనే అనుకున్నాం కానీ.. ఇంత పెద్ద హిట్ అవుతుందని అనుకోలేదు. కొంచెం నవ్విస్తే చాలు.. బ్రహ్మారథం పడతారని ప్రేక్షకులు నిరూపించారు. మా బ్యానర్‌లో ఇది 31వ సినిమా. ఇన్ని సినిమాల్లో మాకు ఎక్కువ లాభాలను తెచ్చి పెట్టిన సినిమా ఇదే అయ్యింది. పేరుతో పాటు డబ్బును తెచ్చిన సినిమా ఇది'' అన్నారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ ''సినిమాను పెద్ద సక్సెస్ చేసినందుకు థాంక్స్ చెప్పడం చిన్నమాటే అవుతుంది. కామెడీ అంటే చిరంజీవిగారిది, వెంకటేష్‌గారి సినిమాలు ఎక్కువగా చూసేవాడిని. చిరంజీవిగారి సినిమాలు చూసి ఇన్‌స్పైర్ అయితే.. వెంకటేష్‌గారితో ఈ సినిమాకు వర్క్ చేసి ఇన్‌స్పైర్ అయ్యాను. కామెడీ సీన్స్‌లో వెంకటేష్‌గారితో నటించాలంటే సిగ్గు, భయంగా ఉండేది. ఎలా చేస్తానో అనుకునేవాడిని. కానీ ఆయన ఓ సోదరుడిలా ఉండి సపోర్ట్ చేశారు. త్వరలోనే ఎఫ్ 3 చేయబోతున్నాం. ఎఫ్ 2నే ఇలా ఉంటే ఎఫ్ 3 ఎలా ఉంటుందో ఆలోచించుకోండి'' అన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ ''సినిమాను హిట్, సూపర్‌హిట్ అనుకుంటే.. ప్రేక్షకులు సూపర్ డూపర్ హిట్ చేసేశారు. మనస్ఫూర్తిగా ప్రేక్షకుల కళ్లలో ఆనందం చూసినప్పుడు.. పదేళ్ల తర్వాత థియేటర్‌కు వెళ్లి అక్కడ ఆడియెన్స్ రెస్పాన్స్ చూసినప్పుడు.. నాకు మాత్రం కళ్లలో కన్నీళ్లు వచ్చేశాయి. మేం అందరం కష్టపడి పనిచేసినప్పుడు .. ప్రేక్షకులు బాగా ఆదరించినప్పుడు ఆ ఆనందమే వేరు. మీరు మళ్లీ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా చేయాలి. ఆడియెన్స్ మిమ్మల్ని అలా చూడాలనుకుంటున్నారని చెప్పినప్పుడు ఆనందమేసి అటెంప్ట్ చేశాను. దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్‌లకు ఇంత మంచి సినిమా ఇచ్చినందుకు థాంక్స్. వరుణ్ చాలా మంచి నటనను కనపరిచాడు. తమన్నా, మెహరీన్‌లకు థాంక్స్. సినిమాటోగ్రాఫర్ సమీర్ రెడ్డికి, అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చిన దేవిశ్రీ సహా ఎంటైర్ యూనిట్‌కు థాంక్స్. ఫ్యామిలీతో మళ్లీ మళ్లీ సినిమా చూసి ఎంజాయ్ చేయండి '' అన్నారు.



పదేళ్ళ తర్వాత హైదరాబాద్‌లో కాన్సర్ట్ చేయడం ఆనందంగా ఉంది

- కె.జె.ఏసుదాస్

లెజండరీ సింగర్ కె.జె.ఏసుదాస్ చాలా కాలం తర్వాత హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. జనవరి 20న హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఈ కాన్సర్ట్ జరగనుంది. ఈ సంగీత విభావరిలో ఏసుదాస్‌తోపాటు విజయ్ ఏసుదాస్, కల్పన కూడా పాల్గొంటారు. ఈ నేపథ్యంలో జనవరి 19న కె.జె.ఏసుదాస్, ఆయన తనయుడు విజయ్ ఏసుదాస్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.జె.ఏసుదాస్ మాట్లాడుతూ ''నేను అక్షరాల విషయంలో చాలా పర్‌ఫెక్ట్‌గా ఉండాలనుకుంటాను. ఇది నా తల్లి నుంచి నేర్చుకున్నాను. నేను క్రిష్టియన్ ఫ్యామిలీలో పుట్టినప్పటికీ సంస్కృతంలోని అక్షరాలను నేర్చుకోమని ఆమె చెప్పారు. అది ఆమె నాకు అందించిన ఆశీర్వాదం. మరో ఆశీర్వాదం ఏమిటంటే.. నేను ఐదేళ్ళ వయసులో ఉన్నప్పుడు చదువు గురించి ఎలాంటి బెంగా పెట్టుకోవద్దు. నార్మల్‌గా చదువుకుంటే చాలు. కానీ, కర్నాటిక్ క్లాసికల్ మ్యూజిక్‌ని ప్రాపర్‌గా నేర్చుకోమని చెప్పారు. మ్యూజిక్, ఆర్ట్స్‌లాంటివి ఏమీ వద్దు.. స్కూల్‌కి వెళ్ళి చదువుకోమని చెప్పే ఆరోజుల్లో నన్ను సంగీతం నేర్చుకోమని ప్రోత్సహించారు. నాకు బ్రదర్స్, సిస్టర్ ఉన్నారు. వాళ్ళు కూడా బాగా పాడేవారు. కానీ, వాళ్ళను మా నాన్నగారు ఎంకరేజ్ చెయ్యలేదు. నన్ను మాత్రమే ఈ విషయంలో ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నా తల్లిదండ్రుల్ని, నా మాస్టర్‌ని గుర్తు చేసుకుంటున్నాను. గురువు లేకుండా ఎవరూ గొప్పవారు కాలేరు. మనల్ని తీర్చిదిద్దిన గురువులు అంతా దేవుళ్ళతో సమానం. అది నా నమ్మకం. నేను ఇప్పటివరకు ఏం సాధించినా అదంతా నా తల్లిదండ్రులు, గురువుల వల్లే సాధ్యమైంది. అలాగే నా పాటలు వినేవారు, సంగీత ప్రియుల ప్రార్థనల వల్లే నేను ఈ స్థాయికి వచ్చాను. అంతకుమించి మరేం లేదు. నేను దాదాపు 10 సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేస్తున్నాను. మధ్యలో కొన్ని క్లాసికల్ కాన్సర్ట్స్ చేసినప్పటికీ లైవ్ మ్యూజిక్ మాత్రం చాలా కాలం తర్వాత చేస్తున్నాను. నా బ్రదర్ అలేఖ్య హోమ్స్ శ్రీనాథ్ నన్ను లైవ్ మ్యూజిక్ చెయ్యమని చెప్పారు. హైదరాబాద్‌లో మళ్లీ ఈ కాన్సర్ట్ చెయ్యడం చాలా ఆనందంగా ఉంది. ఈ కాన్సర్ట్‌లో ప్రధానంగా తెలుగు పాటలు పాడతాము. అలాగే కొన్ని తమిళ్, హిందీ, మలయాళం పాటలు ఉంటాయి. నేను త్రివేండ్రంలో విద్వాన్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా తండ్రిగారు అస్వస్థతకు లోనుకావడం, ఆర్థికంగా సరైన స్థితిలో లేకపోవడం వల్ల ఆ కోర్సు పూర్తి చేయకుండానే వచ్చేయడం జరిగింది. అందుకే నేను సంగీతంలో విద్వాన్‌ని కాదు, విద్యార్థిని మాత్రమే. ప్రతి రోజూ కర్నాటిక్ మ్యూజిక్ నేర్చుకుంటూనే ఉంటాను. అంతకుముందు నేను చేసిన పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటాను. విద్యార్థులెవరైనా ఇది గుర్తుంచుకోవాలి. ముందు రోజు చేసిన తప్పుల్ని తెలుసుకొని వాటిని సరిదిద్దుకోగలిగితే ముందు ముందు ఎంతో సాధించవచ్చు. ఇది సంగీతానికి మాత్రమే కాదు, ఏ రంగానికైనా వర్తిస్తుంది. మా నాన్నగారు చనిపోయేవరకు కూడా ఒక్కసారి కూడా నేను బాగా పాడుతున్నానని చెప్పలేదు. మన పిల్లల్ని మనమే అప్రిషియేట్ చెయ్యకూడదు. వాళ్ళకు వాళ్ళు ఎదగాలి. మా అబ్బాయి విజయ్ కూడా పాటలు పాడుతున్నాడు. అతని వయసు ఇప్పుడు 40. నా వయసు 79. కానీ, నేను ఇప్పటికీ విద్యార్థిననే చెప్తున్నాను. కానీ, మా అబ్బాయి ఆలోచన వేరుగా ఉండొచ్చు. ఇప్పుడొస్తున్న సింగర్స్ చాలా మంది బాగా పాడుతున్నారు. ఇప్పుడు సౌకర్యాలు బాగా పెరిగాయి. ఆరోజుల్లో నేను, సుశీల డ్యూయట్ పాడితే ఒకే మైక్‌లో ఒకరి తర్వాత ఒకరం పాడేవాళ్లం. కానీ, ఇప్పుడలా కాదు. డిఫరెంట్ ట్రాక్స్ వచ్చేసాయి. నిన్న నేను ఓ మలయాళం పాట పాడాను. నాతో పాట పాడే అమ్మాయిని నేను చూడలేదు కూడా. నా ట్రాక్ వరకు నేను పాడాను. తర్వాత ఆమె పాడిన ట్రాక్‌ని మిక్స్ చేస్తారు. అయితే ఆరోజుల్లో సింగర్స్ మధ్య సాన్నిహిత్యం ఉండేది'' అన్నారు.

విజయ్ ఏసుదాస్ మాట్లాడుతూ ''మొదట్లో నేను నాన్నగారి అడుగుజాడల్లోనే వెళ్ళాను. ఆ తర్వాత నేను రియలైజ్ అయ్యాను. ఎందుకంటే అవి ఆయన వేసుకున్న ఫుట్‌స్టెప్స్. ఆయన ఈ స్థాయికి రావడానికి ఎలాంటి అడుగులు వేసారో ఆయనకే తెలుసు. అందుకే నా సొంతదారిలోనే వెళ్ళాలని డిసైడ్ అయ్యాను. అయితే కొన్ని విషయాల్లో ఆయన గైడెన్స్ తీసుకుంటాను. నాన్నగారి టైమ్‌లో ఇళయరాజాగారితో కలిసి చాలా సినిమాలకు పనిచేశారు. ఇద్దరూ ఫ్రెండ్స్‌లా, బ్రదర్స్‌లా ఉండేవారు. అలాగే ఇప్పుడు నేను, యువన్‌శంకర్‌రాజా కలిసి పనిచేస్తున్నాం. నాన్నగారు ఈ వయసులో కూడా ఇంకా నేర్చుకుంటున్నానని చెప్పడం మా జనరేషన్‌కి టెన్షన్ కలిగిస్తుంది. నేను రెండు సినిమాల్లో నటించాను కూడా. అయితే నేను నటుడ్ని కాదు. కెమెరా ముందు ఉండడం, యాక్ట్ చేయడం నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇప్పుడు బయోపిక్‌లు చాలా వస్తున్నాయి. అలాగే నాన్నగారి బయోపిక్ చేసే ఆలోచన ఉందా అని అడుగుతున్నారు. అయితే నాకు అలాంటి ప్లాన్స్ ఏమీ లేవు. కానీ, ఎవరైనా చేస్తే నేను ఇన్‌వాల్వ్ అవ్వాలనుకుంటున్నాను'' అన్నారు.



'మా' ఎన్నికల్లో పోటీ చేస్తా

- నరేష్

క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వైవిధ్యమైన పాత్రలను పోషిస్తూ నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న నరేష్ విజయ్ కృష్ణ పుట్టినరోజు జనవరి 20. పుట్టినరోజు సందర్భంగా పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ''దృశ్యం సినిమా నుండి వరుసగా మంచి సినిమాలు వస్తున్నాయి. మంచి సినిమాలు, పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చి సినిమాలు చేసుకుంటూ వస్తున్నాను. సక్సెస్ రేట్ పెరుగుతూ వస్తుంది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వచ్చినప్పుడు ఎస్.వి.రంగరావుగారిని దృష్టిలో పెట్టుకున్నాను. ఓ జోనర్‌కే పరిమితం కాకుండా అన్నీ సినిమాలు చేయాలనుకున్నాను. నాకు వచ్చిన పాత్రలన్నీ అలా డిఫరెంట్‌గానే వచ్చాయి. గత ఏడాది తెలుగు సినిమాకు వచ్చిన 10-12 హిట్ చిత్రాల్లో 8 చిత్రాల్లో నేను నటించాను. మంచి పాత్రలు చేశాను. వెబ్ సిరీస్‌ల్లో కూడా నాకు మంచి అవకాశాలు వస్తున్నాయి. మంచి వెబ్ సిరీస్ ఎంచుకుని అందులో నటిస్తాను. కొంచెం సెలక్టివ్‌గా మంచి పాత్రలను ఎంచుకుంటున్నాను. ఈ ఏడాది కూడా మంచి పాత్రలతోనే స్టార్ట్ అయ్యింది. మళ్లి జంధ్యాల దర్శకత్వంలో కార్తికేయ హీరోగా చేస్తున్న సినిమాలో నటిస్తున్నాను. అలాగే ఫణిరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. వీటితో పాటు మరో ఆరు సినిమాలు పైప్‌లైన్‌లో ఉన్నాయి. 2019 కూడా తెలుగు ఇండస్ట్రీకి చాలా బావుంటుంది. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) 25 వసంతాలను పూర్తి చేసుకుంటుంది. ఒక మెంబర్‌గా నా వంతు సపోర్ట్ చేస్తున్నాను. వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడిగా ఉంటూ మంచి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాం. అర్హత ఉన్నవారికి పెన్షన్ మొత్తాన్ని పెంచాం. వాహనాలు ఇచ్చాం. 'మా' ఎలక్షన్ అనివార్యమైనప్పుడు.. అందరినీ సంప్రదించి అవసరం అయితే 'మా' ఎన్నికల్లో పోటీ చేస్తాను. నేను ఒక టర్మ్ మాత్రమే నిలబడతాను. ఒకసారి గెలిస్తే చరిత్రలో మళ్లీ నిలబడను'' అన్నారు.

ఫిబ్రవరిలో శౌర్య కొత్త చిత్రం



సక్సెస్‌కు ఉన్న గుర్తింపు వేరే. అదే సక్సెస్‌లో లేనప్పుడు ఎవరూ పట్టించుకోరు. కానీ ఇప్పుడు నాగశౌర్యకు అలాంటి పరిస్థితే ఎదురైంది. నాగశౌర్య హీరోగా, నిర్మాతగా చేసిన 'నర్తనశాల' అనుకున్న స్థాయిలో హిట్ కాకపోవడంతో నాగశౌర్య సినిమా ట్రాక్ ఎక్కడంలో ఆలస్యమవుతూ వచ్చింది. మధ్యలో స్టార్ట్ కావాల్సిన సినిమా ఆగిపోయింది. ఇప్పుడు నాగశౌర్య మరోసారి అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నాడని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇంతకు ముందు అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో ఊహలు గుసగుసలాడే, జోఅచ్యుతానంద సినిమాల్లో నటించాడు. హ్యాట్రిక్ టైం ఈ జోడి చేయబోయే సినిమా కాబట్టే సినిమాపై మంచి అంచనాలుంటాయనడంలో సందేహం లేదు. ఫిబ్రవరి నుండి సినిమా సెట్స్‌కు వెళుతుంది.

పోసాని పొలిటికల్ మూవీ



ఆంధ్రప్రదేశ్ ప్రతి పక్ష నేత వై.ఎస్.జగన్‌పై రచయిత, దర్శకుడు,నటుడు పోసాని కృష్ణ మురళి ఓ సినిమా చేయబోతున్నారు. రచన, దర్శకత్వ శాఖలకు దూరంగా ఉంటున్న పోసాని క ష్ణమురళి త్వరలోనే మరోసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. రాజకీయంగా వై.ఎస్.జగన్‌కు తన మద్ధతుని తెలియజేస్తూ వస్తున్న పోసాని రానున్న ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వై.ఎస్.జగన్‌పై ఓ సెమీ బయోపిక్ చేయనున్నారని, ఇప్పటికే కడప జిల్లా పలివెందులలో చిత్రీకరణను ప్రారంభించారని వార్తలు వినపడుతున్నాయి. శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి ఈ సినిమాను నిర్మిస్తున్నారట. ఎన్నికలు ముందు ఈ సినిమాను విడుదల చేసేలా పోసాని ప్లాన్ చేస్తున్నాడని సమాచారం.



● అనసూయ

విజయ్ దేవర కొండ చిత్రంలో..

స్టార్ యాంకర్‌గా పేరున్న అనసూయ ఇప్పుడు సినిమాల్లో కూడా కీలక పాత్రల్లో నటిస్తూ ఉంది. రీసెంట్‌గా 'ఎఫ్ 2.. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' చిత్రంలో కూడా చిన్న గెస్ట్ పాత్రలో తళుక్కున మెరిసింది. ఇప్పుడు విజయ్ దేవరకొండ సినిమాలో నటించనుందట. అయితే ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ నటించడం లేదట. కింగ్ హిల్స్ బ్యానర్‌పై విజయ్ దేవరకొండ నిర్మాణంలో సినిమా నిర్మితమవుతుంది. ఇందులో తరుణ్ భాస్కర్ ఓ లీడ్ పాత్రలో నటించబోతున్నాడు. ఇప్పుడు మరో లీడ్ పాత్రలో అనసూయ నటించబోతుంది. ఈ రెండు పాత్రలతో పాటు మరో రెండు పాత్రలు కూడా కీలకంగా ఈ చిత్రంలో ఉంటాయట. విజయ్ దేవరకి పెళ్ళిచూపులుతో బ్రేక్ ఇచ్చిన తరుణ్ భాస్కర్‌తోనే సినిమా చేయడం గొప్ప విషయమే కదా!.

పోర్న్‌స్టార్ రమ్యకృష్ణ!



హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకున్న నటి రమ్యకృష్ణ 'బాహుబలి' చిత్రంలో పోషించిన శివగామి పాత్ర ద్వారా మరింత పాపులర్ అయ్యారు. ఇప్పుడు ఆర్టిస్ట్‌గా మరింత బిజీ అయ్యారు. తాజాగా ఓ తమిళ సినిమాలో పోర్న్ స్టార్ పాత్రలో కనిపించబోతున్నారు. విజయ్ సేతుపతి, సమంత జంటగా త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పేరు 'సూపర్ డీలక్స్'. ఈ సినిమాలో విజయ్ సేతుపతి లేడీ గెటప్‌లో కనిపిస్తారు. రమ్యకృష్ణ.. లీలా అనే శృంగార తారగా కనిపించనుంది. ముందుగా ఈ పాత్ర కోసం నదియాను సంప్రదించారు. ఈ క్యారెక్టర్ చేయడానికి ఆమె తిరస్కరించడంతో రమ్యకృష్ణను తీసుకున్నారు. సమంత ఈ సినిమాలో రెండు గెటప్స్‌లో కనిపిస్తుంది. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

'గేమర్' ట్రైలర్ ఆవిష్కరణ



బి.జి.వేంచర్స్ పతాకంపై నూతన నటీనటులతో రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమర్'. శ్రనిత్ రాజ్, కల్యాణి పటేల్, అనిరుధ్, నేహా ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. ఇలాంటి చిన్న సినిమాల దర్శకనిర్మాతలను ప్రోత్సహించే భాద్యత ప్రభుత్వం పైనా, సమాజం పైనా ఉంది. ఎందుకంటే వీళ్ళందరికి థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. కొత్త టాలెంట్ రావాలంటే చిన్న దర్శకనిర్మాతలను ఎంకరేజ్ చేయాలి'' అన్నారు. హీరో శ్రనీత్ మాట్లాడుతూ ''ట్రైలర్ విడుదల చేసిన వివేక్‌గారికి థాంక్స్. నా తల్లిదండ్రుల వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. నాకు మెయిన్ కారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ గారికి థాంక్స్. సినిమా బాగా వచ్చింది'' అన్నారు. దర్శకనిర్మాత రాజేష్ మాట్లాడుతూ ''ఎంతో బిజీగా ఉండికూడా చిన్న సినిమాను ఎంకరేజ్ చేయడం కోసం మా సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించిన వివేక్ అన్నకు ధన్యవాదాలు. ఇప్పటికే ఆరు చిత్రాలు చేసిన నాకిది ఏడవ సినిమా. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయిన ఈ సినిమాను ఫిబ్రవరి 1న విడుదల చేయబోతున్నాం'' అన్నారు.

పరమేశ్వరన్‌కు కీలక పదవి

- ట్రంప్ యంత్రాంగంలో భారతీయుడికి చోటు



వాషింగ్టన్, జనవరి 19: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో మరో భారత సంతతి అమెరికన్‌కు కీలక పదవి లభించనుంది. ప్రముఖ ఆర్థిక రంగ నిపుణుడు ప్రేమ్ పరమేశ్వరన్‌ను ఏషియన్ అమెరికన్ పసిఫిక్ ఐర్లాండర్స్ అడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా నియమించేందుకు ట్రంప్ అంగీకరించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. మొత్తం 12 మంది సభ్యులున్న ఈ కమిటీలో పరమేశ్వరన్ ఏకైక ఇండో అమెరికన్ కావడం విశేషం. న్యూయార్క్‌లో స్థిరపడ్డ పరమేశ్వరన్ ప్రస్తుతం ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థ ఉత్తర అమెరికా విభాగం అధ్యక్షుడిగా, గ్రూప్ సీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. ఇండో అమెరికన్లతో పాటు అగ్రరాజ్యంలో స్థిరపడ్డ పసిఫిక్ ద్వీపవాసుల ఆరోగ్యం, విద్య, ఆర్థిక వృద్ధిని మెరుగుపర్చేందుకు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ సలహా కమిషన్‌ను తొలుత ఏర్పాటుచేశారు. ఇందులో వాణిజ్యం, ఆరోగ్యం, విశ్వవిద్యాలయాలు, ఎన్జీవోలు సహా వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉంటారు.

పిజ్జా బాయ్ కాదు.. బుష్!

- సిబ్బందికి స్వయంగా పిజ్జాలు అందజేత



వాషింగ్టన్, జనవరి 19: అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ. బుష్.. తన భద్రత చూసుకునే సీక్రెట్ సర్వీసెస్ సిబ్బందికి స్వయంగా పిజ్జాలను అందజేశారు. అమెరికా పాక్షిక షట్‌డౌన్ కారణంగా 29 రోజులుగా ఫెడరల్ ఉద్యోగులు జీతాల్లేకుండా పనిచేస్తున్నారు. చాలా రోజులుగా వేతనాలు లేకపోవడం వల్ల వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీక్రెట్ సర్వీసెస్‌కు చెందిన అధికారులకు బుష్ పిజ్జాలు తీసుకెళ్లి ఇచ్చారు. దానికి సంబంధించిన ఫొటోను ఆయన ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. రిపబ్లికన్లు, డెమోక్రాట్లు ఒక నిర్ణయానికి వచ్చి షట్‌డౌన్ ఎత్తేయాలని బుష్ పిలుపునిచ్చారు. 6 వేలమంది సీక్రెట్ సర్వీసు ఉద్యోగులతో పాటు వేతనాలు లేకుండా పనిచేస్తున్న 8 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులకు తాను, తన భార్య లారా ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మించేందుకు నిధులు కేటాయించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుబట్టగా.. అందుకు డెమోక్రాట్లు అంగీకరించడం లేదు. నిధులు కేటాయిస్తేనే తాను ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదిస్తానని ట్రంప్ పట్టుబట్టడంతో ప్రభుత్వ చెల్లింపులకు డబ్బు లేక తాత్కాలికంగా అమెరికా షట్‌డౌన్ మొదలైంది.

అవినీతిపరులపైనే చర్యలు

- ప్రజాధనం దోచుకోకుండా అడ్డుకున్నా
- వాళ్లంతా కలసి మహా కూటమి కట్టారు
- బీజేపీకి కాదు ప్రజలకే ఇది వ్యతిరేకం
- అభివృద్ధికి, అవినీతికి మధ్య పోటీ: మోదీ



సిల్వస్సా, జనవరి 19: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోల్‌కతాలో విపక్షాలు ఐక్యత ర్యాలీ నిర్వహించిన నేపథ్యంలో.. ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి వారిపై విమర్శలు సంధించారు. అవినీతికి పాల్పడే వారిపైనే తాను చర్యలు తీసుకుంటున్నానని, ప్రజాధనాన్ని దోచుకోకుండా తాను నిరోధించడంతో వారికి కోపం రావడం సహజమేనని అన్నారు. దీంతో వారు మహాకూటమి పేరుతో కూటమిని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దేశాన్ని దోచుకోకుండా తాను అడ్డుకున్నవారంతా కలసి మహాకూటమి ఏర్పాటు చేశారని విమర్శించారు. శనివారం కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సారథ్యంలో ఏర్పాటు చేసిన విపక్షాల ఐక్యత ర్యాలీలో ఏపీ, కర్ణాటక, ఢిల్లీ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కుమారస్వామి, అరవింద్ కేజ్రీవాల్, మాజీ సీఎంలు ఫరూక్ అబ్దుల్లా, శరద్ పవార్ సహా పలు ప్రాంతీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఇదే రోజు దాద్రా నగర్ హవేలిలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ విపక్షాల తీరుపై విరుచుకుపడ్డారు. సొంత రాష్ట్రాలలో ప్రజాస్వామ్యాన్ని గౌరవించనివారే నేడు ప్రజాస్వామ్యం కాపాడాలంటూ మాట్లాడటం నిజంగా హాస్యాస్పదమని మోదీ విమర్శించారు. గతంలో కాంగ్రెస్‌ను విమర్శించినవారంతా నేడు కలసి వస్తున్నారని అన్నారు. ఈ మహాకూటమి బీజేపీకి వ్యతిరేకంగా కాదని, దేశ ప్రజలకు వ్యతిరేకమని మోదీ పేర్కొన్నారు. అందరూ కలసి ఇంకా ఓ వేదికపైకి రాలేదని, అయితే వారి మధ్య ఒప్పందాలు కుదిరిపోయాయని అన్నారు. పురుషులు, మహిళలు, తొలిసారి ఓటు హక్కు పొందినవారందరూ ప్రతిపక్షాలను సునిశితంగా పరిశీలిస్తున్నారని, వారు నిజమైన పోరాటాన్ని చూస్తారని మోదీ అన్నారు. ''సానుకూల, వ్యతిరేక భావజాలానికి మధ్య ఇది పోటీ. అలాగే అభివృద్ధికి, అవినీతికి మధ్య ఇది పోటీ. ప్రజలకు, విపక్ష కూటమికి మధ్య పోటీ'' అని మోదీ అభివర్ణించారు. ప్రత్యేకించి పార్టీ పేరును ప్రస్తావించకుండా.. ఏ కూటమి కూడా వారి అక్రమాల నుంచి తప్పించుకోవడానికి సాయపడదని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి ఒకే ఎమ్మెల్యే ఉన్నారని, అలాంటి పార్టీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలన్నీ కూటమి కట్టాయని ఎద్దేవా చేశారు. ఒక ఎమ్మెల్యేతోనే బీజేపీ ఆ రాష్ట్రంలో ఇతర పార్టీలకు నిద్రలేకుండా చేస్తోందని మోదీ అన్నారు.

ఫిరంగుల తయారీ కేంద్రం ప్రారంభం

గుజరాత్‌లోని సూరత్‌లో నెలకొల్పిన తొలి దేశీయ చిన్న ఫిరంగుల తుపాకీ తయారీ కేంద్రాన్ని ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. సూరత్‌కు 30 కి.మీ దూరంలోని హజీరాలో ఎల్ అండ్ టీ కంపెనీ దీన్ని ఏర్పాటు చేసింది. భారత సైన్యానికి 100 యూనిట్ల కే9 వజ్ర–టీ 155 ఎంఎం/కాలిబర్ చిన్న ఫిరంగుల తుపాకీ ఆయుధాలను సరఫరా చేయడానికి 2017లో ఎల్ అండ్ టీ సంస్థ 4500 కోట్ల రూపాయల కాంట్రాక్టును దక్కించుకుంది. ఇందులో భాగంగా హజీరాలో ఏర్పాటు చేసిన ఫిరంగుల తయారీ యూనిట్‌ను మోదీ ప్రారంభించారు. దేశంలో ప్రైవేట్ రంగంలో ఇదే తొలి యూనిట్ అని అధికారులు తెలిపారు.

ఎక్స్‌పైరీ డేట్ ముగిసింది

- ఇక బీజేపీ సర్కారు దిగిపోవాల్సిందే
- ప్రధాని అభ్యర్థి ఎవరో ముఖ్యంకాదు
- ముందు బీజేపీని ఓడించడమే లక్ష్యం
- దేశాన్నిదోచుకుని.. ఆ పార్టీ వెనకడుగు
- వాళ్లు చెప్పిన అచ్ఛే దిన్ రానే రాలేదు
- కోల్‌కతా ర్యాలీలో బెంగాల్ సీఎం మమత
- ఉన్నఉద్యోగాలూ పోయాయి: ఖర్గే
- సమాజాన్నిబీజేపీ చీల్చింది: కేజ్రీవాల్
- బీజేపీ కూటమిలో ఈడీ, సీబీఐ: అఖిలేశ్
- బెంగాల్ పులి గర్జించింది: అరుణ్ శౌరి





కోల్‌కతా, జనవరి 19: నరేంద్ర మోదీ సర్కారుకు గడువు తేదీ (ఎక్స్‌పైరీ డేట్) ముగిసిందని.. ఇక ఆ ప్రభుత్వం దిగిపోక తప్పదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. పలువురు ప్రతిపక్ష నాయకులు, లక్షలాది మంది ప్రజలు హాజరైన 'యునైటెడ్ ఇండియా ర్యాలీ'కి ఆమె నాయకత్వం వహించి ప్రసంగించారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చేసార్వత్రిక ఎన్నికల్లో ఓడించి తీరాలని ఆమె అన్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ ర్యాలీకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ సహా పలువురు అగ్రశ్రేణి రాజకీయ నాయకులు హాజరయ్యారు. రఫేల్ ఒప్పందంలో పారదర్శకత లేకపోవడం దగ్గర నుంచి మతపరమైన అసహనం వరకు బీజేపీ సర్కారుపై మమతా బెనర్జీ, ఇతర నాయకులు అనేక ఆరోపణలు చేశారు. సమైక్య ప్రతిపక్షంలో ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరని ఆలోచించుకోవాల్సిన సమయం ఇది కాదని, ఆ విషయాన్ని తర్వాత చూసుకోవచ్చు గానీ ప్రస్తుతం నరేంద్రమోదీని, బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇన్నేళ్లపాటు దేశాన్ని దోచుకున్న తర్వాత బీజేపీ వెనకడుగు వేసిందని, వాళ్లు చెప్పిన 'అచ్ఛేదిన్' రాకపోవడంతో పాటు.. వాళ్లు చేసిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు.

ప్రధాని మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ, హోల్‌సేల్ వ్యాపారి, పంపిణీదారుడని రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వి యాదవ్ అన్నారు. ఆయన కాపలాదారు అయితే ప్రజలు ఠాణేదార్లు (పోలీసు అధికారులు) అని, మోదీ ఏమైనా తప్పు చేస్తే ప్రజలే దండిస్తారని అన్నారు. కార్యక్రమానికి ఆయన కొంత ఆలస్యంగా వచ్చారు.

రఫేల్ ఒప్పందంపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని అని ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రెబల్ నాయకుడు శత్రుఘ్న సిన్హా ప్రశ్నించారు. ప్రతిపక్షానికి చాలా కొద్ది ప్రశ్నలు మాత్రమే ఉన్నాయని, కానీ వాటికి జవాబు చెప్పేవరకు ప్రజలు మాత్రం 'చౌకీదార్ చోర్ హై' (కాపలాదారు దొంగ) అంటారని విమర్శించారు. తనను పార్టీ నుంచి బహిష్కరించినా భయం లేదన్నారు.

గత లోక్‌సభ ఎన్నికలలో ప్రధానమంత్రి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఉన్న ఉద్యోగాలను కూడా ఊడగొట్టారని కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తినను, తిననివ్వనని మోదీ అప్పట్లో చెప్పారని, కానీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని అన్నారు. లౌకిక విలువలను కాపాడాలంటే మనమంతా ఒక్కటిగా ఉండి ఒక్కటిగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.

పాకిస్థాన్ గత 70 ఏళ్లుగా చేయలేని పనిని నరేంద్రమోదీ సర్కారు ఐదేళ్లలో చేయగలిగిందని, ఇది కచ్చితంగా బీజేపీ విజయమేనని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. సమాజాన్ని నిట్టనిలువునా చీల్చిందని, ఒక మతాన్ని మరో మతంపై రెచ్చగొట్టిందని, అందుకే మోదీ–షా భాగస్వామ్యాన్ని విడగొట్టాలని ఆయన అన్నారు. పెద్దనోట్ల రద్దు, వ్యవసాయ బీమా లాంటి వాటినికూడా ఆయన విమర్శించారు.



మహాకూటమి అంటే లెక్కలేనన్ని గ్రూపులుంటాయని, వాళ్లకు ఒక నాయకుడు అంటూ ఉండడని బీజేపీ చేస్తున్న వాదనను యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్ ఖండించారు. ఆ నాయకుడిని ప్రజలే ఎన్నుకుంటారన్నారు. బీజేపీ కూటమిలో సీబీఐ, ఈడీ కూడా ఉన్నాయని.. తమతో మాత్రం ప్రజలున్నారని ఆయన చెప్పారు.

ఏ ఒక్కరి ఖాతాలోకైనా మోదీ సర్కారు రూ. 15 లక్షలు డిపాజిట్ చేసిందా అని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ప్రశ్నించారు. ఒకవైపు పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు భగ్గుమంటుంటే మోదీ మాత్రం విదేశాలకు చక్కర్లు కొట్టారని విమర్శించారు. ఇది కార్పొరేట్ ప్రభుత్వమని, ప్రైవేటు సంస్థలా నడుస్తోందని అన్నారు.

ఈవీఎం అంటే ఒక దొంగ మిషన్ అని, ఎన్నికల కమిషన్‌ను కలిసి ఈవీఎంల వాడకాన్ని ఆపాల్సిందిగా కోరాలని జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ప్రపంచంలో ఏ దేశమూ వీటిని వాడటం లేదని ఆయన చెప్పారు. ఎన్నికలు సజావుగా సాగాలంటే బ్యాలట్ పేపర్లే ఉండాలన్నారు.

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని విసిరి పారేయడానికి ప్రతిపక్షం కలిసికట్టుగా ఉండాలని కేంద్ర మాజీమంత్రి అరుణ్ శౌరి పిలుపునిచ్చారు. బెంగాల్ పులి గర్జించిందని, బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చిందని.. ఇది విజయవంతం అవుతుందనే తాను ఆశిస్తున్నానని ఆయన చెపపారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలంటే బీజేపీ అభ్యర్థుల మీద ప్రతిపక్షాలన్నీ కలిసి ఒక్కో అభ్యర్థినే నిలబెట్టాలని సూచించారు. మన ముందు ఒకటే లక్ష్యం ఉందని.. అది బీజేపీని ఓడించడమని, ఈ విషయంలో మహాభారతంలో అర్జునుడిలా ఉండాలని తెలిపారు. మోదీ–షా ద్వయం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని చెప్పారు. అన్ని విషయాల్లోనూ ఈ ప్రభుత్వం అబద్ధాలే చెప్పిందని, దేశంపై తన పట్టు పోయిందని మోదీకి కూడా తెలుసన్నారు.

అవినీతి నేతల ఐక్యతా ర్యాలీ

- కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియో

కోల్‌కతా, జనవరి 19: కోల్‌కతాలో జరిగిన మెగా విపక్ష ర్యాలీని 'అవినీతి నేతల ఐక్యతా ర్యాలీ'గా కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియో అభివర్ణించారు. మమతా ఆధ్వర్యంలో జరిగిన విపక్షాల భారీ ర్యాలీపై వరుసపెట్టి ట్వీట్లను సంధించిన బాబుల్ సుప్రియో, ఈ ర్యాలీ అంతా అవినీతి నేతల ఐక్యతను చాటేదిగా, బూటకాన్ని ప్రదర్శించే ర్యాలీగా పేర్కొన్నారు. 'బ్రిగేడ్ ఛలో' అనే నినాదాన్ని వదిలి 'లెట్స్ మేక్ ఇండియా బెటర్' అనే నినాదాన్ని ఎత్తుకుంటే బాగుంటుందని ఆయన ట్వీట్లలో మమతకు హితవు పలికారు. 'నమో ఎగైన్' అంటూ ఆయన ట్వీట్లు సంధించారు.

దుర్గా దేవిగా మమతా ఫొటో

కోల్‌కతా, జనవరి 19: మమతా బెనర్జీ దేశ రాజకీయాల్లో తన సత్తా చాటేందుకు స్వయంగా మైక్రోఫోన్ అందుకున్నారు. భారీ ర్యాలీ, పెద్ద కటౌట్లు, ఇసుకేస్తే రాలనంత జనసంద్రం మధ్య వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ నేతలను ఆమె స్వయంగా ఆహ్వానిస్తూ, వారి ప్రసంగాలను పూర్తిగా వినాలంటూ ప్రజలకు విజ్ఞప్తులు చేశారు. నెటిజన్లను ఆకర్షించేందుకు కార్యక్రమ విశేషాలతో కూడిన ఫొటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు పోస్ట్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించేందుకు దీదీ సైన్యం సర్వ శక్తులూ ఒడ్డింది. ఒక పోస్టరులో సాక్షాత్తూ దుర్గా దేవిలా దీదీని చూపిస్తూ 10 చేతుల్లో 10 ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుపరచారు. ఇక్కడి బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్‌లో తృణమూల్ ప్రభుత్వం సాధించిన విజయాలు వివరిస్తూ ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు దేశవ్యాప్తంగా తాము అమలుచేయబోయే సంక్షేమ పథకాలకు రోడ్ మ్యాప్ వంటిదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చెప్పకనే చెబుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 లోక్‌సభ స్థానాలను టీఎంసీ క్లీన్ స్వీప్ చేస్తుందని, దేశరాజకీయాలను తామే శాసిస్తామనే సందేశాన్ని స్పష్టంగా ఇవ్వడంలో మమతా సఫలమయ్యారు.

టూటికోరిన్ బరిలో కనిమొళి?

- లోక్‌సభకు పోటీ చేసే యోచనలో కరుణ తనయ



చెన్నై, జనవరి 19: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుమార్తె, డీఎంకే మహిళా విభాగం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు కనిమొళి టూటికోరిన్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే యోచనలో ఉన్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డీఎంకే గ్రామ సభల్లో పాల్గొనేందుకు టూటికోరిన్ నియోజకవర్గంలో కనిమొళి వారంరోజుల పర్యటన చేపట్టారు. టూటికోరిన్‌లో పర్యటించడం ద్వారా తాను వచ్చే ఎన్నికల్లో బరిలో దిగాలని కనిమొళి భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. తన పోటీపై పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నిర్ణయం తీసుకుంటారని బదులిచ్చారు. కాగా 2007లో మొదటిసారి రాజ్యసభ సభ్యురాలిగా కనిమొళి ఎన్నికయ్యారు. అనంతరం 2013లోనూ డీఎంకే కనిమొళిని రాజ్యసభకు పంపించింది. కనిమొళి పదవీకాలం ఈ ఏడాది జూలైతో ముగియనున్న నేపథ్యంలో మొట్టమొదటిసారి ఆమె లోక్‌సభ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

బీజేపీకి మాజీ ఎంపీ గుడ్‌బై

- రాహుల్ గాంధీపై ప్రశంసలు
- అమిత్‌షాను కలవడం కష్టం
- మాజీ ఎంపీ ఉదయ్ సింగ్




పట్నా, జనవరి 19: బీజేపీ అధిష్ఠానం తీరుతో తీవ్రంగా విసుగెత్తిన మాజీ ఎంపీ ఆ పార్టీకి రాజీనామా చేశారు. బిహార్‌లోని పూర్ణియా నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన ఉదయ్ సింగ్.. తమ పార్టీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ)కు లొంగిపోయిందని ఆరోపించారు. రెండు పార్టీల మధ్య గతంలో ఉన్న అనుభవాల దృష్ట్యా ఈసారి వద్దని పార్టీ కార్యకర్తలు చాలా చెప్పారని ఆయన అన్నారు. నితీష్ సర్కారు మంచిపేరును వేగంగా పోగొట్టుకుంటోందని, ఇప్పుడు ఆయన చేసిన తప్పుల భారం బీజేపీ కూడా మోయాల్సి వస్తోందని అన్నారు. అది చాలదన్నట్లు ఆయనకు లోక్‌సభలో బోలెడన్ని సీట్లు ఇచ్చారని ఉదయ్‌సింగ్ మండిపడ్డారు.

కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ప్రతిష్ఠ బాగా పెరుగుతోందని ఆయన ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ ఉద్దేశాలు మంచివే అయినా, ఆయన వాస్తవాలకు దూరంగా వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ ముక్తభారత్ అన్న నినాదానని తాను ఎప్పుడూ అంగీకరించలేదని, ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ ఉండబోదని చెప్పారు. ఉదయ్‌సింగ్ అన్న ఎన్‌కే సింగ్ 15వ ఆర్థికసంఘం చైర్మన్‌గా ఉండేవారు. 2004, 2009 సంవత్సరాల్లో పుర్నియా నుంచి ఆయన ఎంపీగా గెలిచారు. ఇప్పటివరకు తాను రాహుల్‌గాంధీతో గానీ, లాలు ప్రసాద్‌తో గానీ మాట్లాడలేదని, కానీ కార్యకర్తల అభీష్టం మేరకు త్వరలో మాట్లాడుతానని చెప్పారు. పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాను కలవడం గగనం అయిపోతోందని, ఉపేంద్ర కుష్వాహా ఎన్నిసార్లు అపాయింట్‌మెంట్ కోరినా ఆయన ఇవ్వడం లేదని సింగ్ చెప్పారు. దాంతో ఆయన తప్పనిసరై మంత్రి పదవికి రాజీనామా చేసి ఎన్డీయే నుంచి తీవ్ర అసంతృప్తితో బయటకు వచ్చారని అన్నారు.

3,100 మంది వైద్యుల నియామకం

- బిహార్ ప్రభుత్వం నిర్ణయం
- మార్కుల ఆధారంగా పోస్టులు
- పరీక్ష.. ఇంటర్వ్యూలు లేనట్లే



పట్నా, జనవరి 19: బిహార్ ఆరోగ్యశాఖ ఒకేసారి 3,100 మంది వైద్యులను నియమిస్తోంది. అయితే అభ్యర్థులకు ఎలాంటి రాతపరీక్ష, ఇంటర్వ్యూ లేకుండా.. కేవలం వారి మార్కుల ఆధారంగా బిహార్ సాంకేతిక కమిషన్ (బీటీసీ) ద్వారా ఈ నియామకాలు చేస్తారు. రాబోయే మూడు నెలల్లో నియామక ప్రక్రియ పూర్తవుతుందని ఆశిస్తున్నట్లు వైద్య శాఖ మంత్రి మంగళ్‌పాండే చెప్పారు. ఈ నియామకాలకు రాతపరీక్ష నిర్వహించకూడదన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. నీట్‌లో ఉత్తీర్ణత నుంచి మెడికల్ లేదా డెంటల్ కోర్సు పూర్తిచేయాలంటే తొమ్మిది పరీక్షలు రాయాలని, అది సరిపోదా అని ఆయన ప్రశ్నించారు. అయితే, రాష్ట్రంలో వైద్యుల కొరత విషయాన్ని మాత్రం ఆయన ప్రస్తావించలేదు. రాష్ట్రంలో 70% వైద్యుల కొరత ఉందని బిహార్ ఆరోగ్యసేవల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రంజిత్‌కుమార్ అన్నారు. అందుకే ప్రభుత్వం ఇంటర్వ్యూలు ఎత్తేసిందని చెప్పారు. జిల్లా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు.. ఇలా అన్నింటిలో కలిపి 11,393 మంది వైద్యులు ఉండాల్సి రాగా కేవలం 2,700 మందే పనిచేస్తున్నారని చెప్పారు. వైద్యవిద్యలో 65% ప్రొఫెసర్ల కొరత ఉందని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అయితే నియామకాల్లో ఆలస్యం అవుతోందని బీటీసీ ద్వారా నియమిస్తున్నారు.

చేతులు నరికేయాలనుకున్నా

- బీజేపీతో చేతులు కలుపుతారా
- రాంకృపాల్‌పై మీసాభారతి ఫైర్



పట్నా, జనవరి 19: బీజేపీతో చేతులు కలపాలని 2014లో రాం కృపాల్ యాదవ్ అన్నప్పుడు.. ఆయన చేతులు నరికేయాలని తనకు అనిపించిందని ఆర్జేడీ అధ్యక్షుడు లాలు ప్రసాద్ కుమార్తె మీసాభారతి అన్నారు. రాజకీయాల్లోకి రాకముందు ఆయన గడ్డిని మిషన్‌తో కోసేవారని, ఆ మిషన్‌లోనే ఆయన చేతులు పెట్టేయాలనిపించిందని చెప్పారు. పార్లమెంటులో చర్చ సందర్భంగా మీసా భారతి తనపై అసభ్యకరమైన భాష వాడుతున్నారని బీజేపీ మిత్రపక్షమైన ఎల్జేపీ అధ్యక్షుడు రాం విలాస్ పాశ్వాన్ ఆరోపించడంతో.. ఆమె వ్యాఖ్య తాజాగా వెలుగులోకి వచ్చింది. రాంకృపాల్ యాదవ్ గడ్డి కోసేవారని, అయినా ఆయనపై తమకు చాలా గౌరవం ఉందని మీసాభారతి అన్నారు. అయితే, ఆయన సుశీల్‌కుమార్ మోదీతో చేతులు కలపడంతో తమకు ఆయనపై గౌరవం పోయిందన్నారు. ఆ సమయంలో తనకు గడ్డికోసే మిషన్‌తో ఆయన చేతులు కోసేయాలనిపించిందని ఆమె చెప్పారు. పాటలీపుత్ర లోక్‌సభ స్థానానికి పోటీ చేయబోతున్న మీసాభారతి.. ఈనెల 16న పట్నాలోని బిక్రమ్ ప్రాంతంలో జరిగిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాంకృపాల్ యాదవ్ తొలుత ఆర్జేడీ నాయకుడు. తర్వాత 2014లో ఆయన ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పాటలీపుత్రలో ఆయన మీసాభారతిని ఓడించారు. అప్పుడు తాను ఎన్నికలకు సరిగా సిద్ధం కాలేదని, ఈసారి గెలిచి తీరుతానని ఆమె ధీమా వ్యక్తంచేశారు.

మేమంతా కలిసే ఉంటాం..

కేరళ సీఎం విజయన్‌కు నన్ లేఖ

తిరువనంతపురం, జనవరి 19: బిషప్ ఫ్రాంకో ముల్లకళ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఆరోపించిన కేరళ క్రైస్తవ సన్యాసిని సాగిస్తున్న పోరాటం రోజుకో మలుపు తిరుగుతోంది. న్యాయపోరాటం ముగిసే వరకూ తామంతా కలిసే ఉంటామంటూ సీఎం పినరయి విజయన్‌కు లేఖరాశారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, తమపై తీవ్రంగా ఒత్తిడి వస్తోందని లేఖలో పేర్కొన్నారు. కేసును నీరుగార్చేందుకు బిషప్ చేస్తున్న ప్రయత్నాలను కూడా బాధితురాలు లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే తనకు అండగా ఉన్న సన్యాసినుల్లో నలుగురిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని, తక్షణం వారు బదిలీ అయిన చోటుకు వెళ్లాలంటూ కొత్తగా నోటీసులు వచ్చాయని లేఖలో ఆమె వివరించారు. తాను పనిచేస్తున్న కాన్వెంట్‌లోనే ఉంటున్న నన్ను ఒంటరిని చేసి మానసికంగా కూడా దెబ్బ తీసేలా చర్చ్ పెద్దలు ప్రయత్నిస్తున్నారు.

ఫెడరర్‌ను కలిసిన విరుష్క జోడి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో టీమిండియా చరిత్ర సృష్టించింది. మొదటగా టీ-20 సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా.. టెస్ట్, వన్డే సిరీస్‌లను సాధించిన కోహ్లీ సేన ఆసీస్ గడ్డపై సరికొత్త చరిత్రను సృష్టించింది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా



గడ్డపై ఒక్క ద్వైపాక్షిక సిరీస్ కూడా గెలవని టీమిండియా.. ఆ లోటును కూడా తీర్చేసుకుంది. శుక్రవారం మెల్బోర్న్ వేదికగా ముగిసిన మూడో వన్డే అనంతరం టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, అతని భార్య అనుష్క శర్మ సంబరాల్లో మునిగిపోయారు. ఇందులో భాగంగా విరాట్ కోహ్లీ తన సతీమణి అనుష్క శర్మతో కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్ మ్యాచ్‌లను చూడడానికి వెళ్లాడు. సెరెనా, జొకొవిచ్ మ్యాచ్‌లను ఈ జంట వీక్షించారు. అనంతరం విరుష్క జంట టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌ను కలిశారు. ఫెడరర్‌తో కలిసి దిగిన ఫోటోను, వారు మ్యాచ్ వీక్షించిన పోటోలను కోహ్లీ తన ట్విటర్ ఖాతాలో షేర్ చేశాడు. 'ఆస్ట్రేలియన్ ఓపెన్ లో అద్భుతమైన రోజు. ఆస్ట్రేలియా వేసవికి మంచి ముగింపు పలికాం. ఎప్పటికీ గుర్తుంచుకుంటాం' అని కోహ్లీ తన ట్విటర్‌లో పేర్కొన్నాడు.

ప్రీ క్వార్టర్స్‌లో సెరెనా, హాలెప్

- జొకొవిచ్, నిషికోరి, జ్వెరెవ్, ఒసాకా ముందంజ
- ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ టెన్నిస్ ప్లేయర్లు సెరెనా విలియమ్స్ (అమెరికా), సిమోన్ హాలెప్ (రోమేనియా) ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. వీరితో పాటు ఒసాకా (జపాన్), ముగురుజ (స్పెయిన్)... పురుషుల సింగిల్స్‌లో జొకొవిచ్, నిషికొరి, జ్వెరెవ్ కూడా ప్రీ క్వార్టర్స్‌కు అర్హత సాధించారు. శనివారమిక్కడ జరిగిన మహిళ సింగిల్స్ పోరులో సెరెనా విలియమ్స్ 6-2, 6-1తో డయానా (ఉక్రెయిన్)పై అలవోకగా విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టగా... టాప్ సీడ్ హాలెప్ 6-2, 6-3తో వీనస్ విలియమ్స్‌పై గెలిచి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌ల్లో



ఒసాకా 5-7, 6-4, 6-1తో సు వీ (చైనీస్ తైపీ)పై గెలుపొందగా... అమెరికాకు చెందిన కీయిస్ 6-3, 6-2తో బెల్జియంకు చెందిన మెర్టిన్స్‌పై విజయం సాధించింది. ముగురుజ 7(7)- 6(5), 6-2తో స్విట్జర్లాండ్‌కు చెందిన టిమియాను ఓడించింది. ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో జొకొవిచ్ మరోసారి రెచ్చిపోయాడు. సెర్బియాకు చెందిన టాప్ సీడ్ జొకొవిచ్ 6-3, 6-4, 4-6, 6-0తో కెనడాకు చెందిన డెనిస్ షపోవాలొవ్‌పై గెలుపొందగా... జర్మనీ ఆటగాడు జ్వెరెవ్ 6-3, 6-3, 6-2తో ఆస్ట్రేలియాకు చెందిన బోల్ట్‌ను ఓడించాడు. మరో పోరులో నిషికొరి 7(8)- 6(6), 6-1, 6-2తో పోర్చుగల్‌కు చెందిన సౌసాపై విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు.

ముగిసిన సైనా పోరు

- మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరు ముగిసింది. సెమీస్‌లో అడుగుపెట్టిన సైనా నెహ్వాల్ స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. శనివారమిక్కడ జరిగిన



మహిళల సింగిల్స్ సెమీస్‌లో సైనా 16-21, 13-21తో ప్రపంచ మాజీ చాంపియన్ మారిన్ చేతిలో పరాజయం పాలైంది. 2017లో టైటిల్ విజేతగా నిలిచిన సైనా... 2011లో రన్నరప్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. 40 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో సైనా తొలుత శుభారంభం చేసినప్పటికీ మారిన్ ముందు నిలవలేకపోయింది. తొలి రౌండ్‌లో 5-2తో ఆధిక్యంలో ఉన్న సైనా మారిన్ ధాటికి 5-5 చేరుకుంది. మారిన్ ఆటకు సైనా కాస్త ఒత్తిడికి గురైంది. దీంతో తొలి రౌండ్‌లో సైనా 16-21తో మారిన్ చేతిలో ఓడిపోయింది. తర్వాత జరిగిన రెండో రౌండ్‌లో సైనా ఏ మాత్రం మారిన్‌కు పోటీనివ్వలేకపోయింది. ఒకానొక దశలో సైనా 1-6తో మారిన్ కంటే వెనుకబడిపోయింది. దీంతో రెండో రౌండ్‌లో కూడా సైనా తనదైన ఆటతీరును ప్రదర్శించలేక మారిన్ చేతిలో ఓటమిని చవిచూసింది. సైనా ఓటమితో మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ కథ ముగిసింది.

(మనం క్రీడా విభాగం)



సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ వంటి విదేశీ టెస్టు సిరీస్‌ల్లో టీమిండియా ఓడినప్పటికీ ఆస్ట్రేలియాలో టీమిండియా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నయని ఎందుకు నమ్మాం? ఎందుకంటే ఆస్ట్రేలియా జట్టు గతంలోలా బలంగా లేకపోవడం ఒక కారణమైతే.. ప్రస్తుత టీమిండియా విదేశాల్లోనూ గలవగల సామర్థ్యాన్ని ఇటీవల ప్రదర్శించడం మరో కారణం. సౌతాఫ్రికా పర్యటనలో టీమిండియా 0-2తో ఓటమిపాలైంది. దీంతో చాలా మంది కోహ్లీ సేనను విమర్శించారు. అలా విమర్శించొద్దని కొందరు మాజీ క్రికెటర్లు కూడా చెప్పారు.

ఎదురులేని మనిషి విరాట్

భారత క్రికెట్ తలరాతను మార్చిన కోహ్లీ

కోహ్లీ సేన శ్రమను, పట్టుదలను చూడాలే తప్ప సౌతాఫ్రికా చేతిలో ఓటమిపాలైందని.. ఇక ఆ రికార్డు ఎన్నడూ మెరుగు పడదని భావించకూడదు. ఆ సమయంలో అభిమానలు కూడా తమ సహనాన్ని కోల్పోయారు. ఎందుకంటే భారత్‌లో జరిగే సిరీస్‌ల్లో గెలుస్తున్న కోహ్లీ సేన విదేశాల్లోనూ గెలుస్తుందని వాళ్లు టీమిండియాపై అధిక ఆశలు పెట్టుకున్నారు. సౌతాఫ్రికాతో సిరీస్‌లో ఓటమిపాలైనప్పటికీ వాండరర్స్‌లో జరిగిన టెస్టులో గమనించదగ్గ సత్తాను టీమిండియా చాటింది. ఆ పిచ్ ప్రమాదకరంగా ఉండింది. దీంతో అంపైర్లు ఆ పిచ్‌పై ఒకట్రెండుసార్లు చర్చించారు కూడా. భారత బ్యాట్స్‌మెన్ తమ శరీరాలకు బంతిని తగిలించుకున్నారే తప్ప పిచ్‌ను నిందించలేదు. చివరికి మ్యాచ్ రద్దయింది. పిచ్ ప్రమాదాన్ని పక్కన పెట్టి బ్యాటింగ్‌ను కొనసాగించేందుకు ఇష్టపడ్డారు. గెలవాలన్న తపన వారిలో కనిపించింది.

ఇంగ్లాండ్ పర్యటనలోనూ టీమిండియా 1-4తో ఓటమిని చవిచూసింది. ఆ సిరీస్‌లో టీమిండియా పట్ల ఇంగ్లాండ్ ఆటగాళ్లు దారుణంగా ప్రవర్తించి దెబ్బ తీశారు. ఇంగ్లాండ్‌లో భారత బౌలర్ల బౌలింగ్ ప్రశంసనీయం. సిరీస్ ఆద్యంతం భారత సీమ్ బౌలర్లు ఇంగ్లాండ్ ఆటగాళ్లను ఆలౌట్ చేశారు. ప్రత్యర్థుల కంటే మెరుగైన ప్రతిభ కనబరిచారు. అయితే గతంలో విదేశాలకు వెళ్లిన టీమిండియాకు ఒక బలహీనత ఉండింది. అది బ్యాటింగ్. గత జట్లన్నీ ఇదే ఇబ్బందితో సతమతమయ్యేవి. ఈ కారణాలన్నింటి వల్ల ఈసారి ఆస్ట్రేలియాలో టీమిండియా గెలుస్తుంద నే నమ్మకం ఏర్పడింది. ప్రస్తుత టీమిండియా బ్యాటింగ్ సమస్యలను అధిగమించగలిగితే గతంలో విదేశీ పర్యటనల్లో ఏర్పడిన మచ్చ లన్నింటినీ ఈ జట్టు తుడిచేస్తుందని అందరూ భావించారు. అంతేకాదు ఆస్ట్రేలియా బాల్స్ నేరుగా బ్యాట్స్‌మన్‌పైకి వస్తాయి. దీంతో బ్యాట్స్‌మెన్ ఈజీగా పరుగులు సాధించొచ్చు.

ఒకవైపు టీమిండియా ఓడిపోతుంటే మరోవైపు బౌలింగ్ యూనిట్ మాత్రం అసాధారణంగా మెరుగవుతూ వచ్చింది. కానీ ఇతరులు పసిగట్టలేని జట్టు అమూల్యమైన బలం, ఆటగాళ్ల స్వభావం, వైఖరి కీలకమయ్యాయి. టీమ్ మేనేజ్‌మెంట్ ఎందుకలా చేస్తూ వస్తోందో ఇప్పటికీ ఎవ్వరికీ అర్థం కావడం లేదు. సౌతాఫ్రికాలో రెండు టెస్టుల్లో, ఇంగ్లాండ్‌లో నాలుగు టెస్టుల్లో టీమిండియా ఓడిపోయివుండొచ్చు. కానీ కోహ్లీ సేన మాత్రం ఓడించగల జట్టుగా ఎన్నడూ కనిపించలేదు. ఇలాంటి వారసత్వాన్నే కోహ్లీ వదిలేశాడు. అతని వైఖరి జట్టుపై ప్రభావం చూపేది. వాండరర్స్‌లో కోహ్లీ ముం దుండి జట్టును నడిపించాడు. ప్రమాదకరమైన పిచ్‌పై కూ డా రొమ్ము విరుచుకుని జట్టును గెలిపించేందుకు కృషి చేశాడు.

ఎంఎస్ ధోనీ తన క్షేమం కోసం చాలా తెలివిగా ఆలోచిస్తాడు. ముమ్ముందు ఏం జరగబోతోందో ముందుగానే పసిగట్టగలడు. 2011 లార్డ్స్ టెస్టు తొలి రోజు ఆటలో జహీర్ ఖాన్ కుంటుతూ నడిచాడు. అయితే బయటి నుంచి చూసే వాళ్లకు మాత్రం సిరీస్ గెలిచేందుకు ధోనీ కృషి చేస్తున్నట్టు కనిపించింది. ఆ సిరీస్‌లోనే కోహ్లీ టెస్టు జట్టుకు కూడా కెప్టెన్ అయ్యాడు. కానీ ఫలితాల్లో పెద్దగా మార్పులు తేలేకపోయాడు. కానీ తన సహజసిద్ధమైన దూకుడు స్వభావాన్ని ప్రదర్శించాడు. మ్యాచ్ తర్వాత మ్యాచ్‌కు, సెషన్ తర్వాత సెషన్‌కు తన ఆలోచన ధోరణిని మార్చుకుంటూ నిరంతరాయంగా పిచ్‌లను అధ్యయనం చేస్తూ గెలుపు కోసం శ్రమించాడు. దీనివల్లే ఏదో ఒక విదేశీ సిరీస్‌లో కోహ్లీ జట్టును గెలుపు బాటలో నడిపిస్తాన్న నమ్మకం ఏర్పడింది. కెప్టెన్ ఎంతటి సమర్థుడో కాలమే చెబుతుంది. కోహ్లీ ఒక కెప్టెన్‌గా కాకుండా మంచి స్నేహితుడిలా సహచరులతో మెలిగాడు. ఆస్ట్రేలియాలో తొలి టెస్టు గెలిచిన తర్వాత అడిలైడ్ నుంచి పెర్త్‌కు వెళ్లేటప్పుడు తన కోసం, తన భార్య అనుష్క శర్మ కోసం తీసుకున్న బిజినెస్ క్లాస్ టిక్కెట్లను సహచర బౌలర్లకు ఇచ్చాడు. తాను అనుకున్నది సాధించడమే కోహ్లీ లక్ష్యం. కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా ఎన్నడూ మైదానంలో నిరాశతో ఉండలేదు. పాక్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ మాదిరిగా ఎన్నడూ కెప్టెన్ దర్పాణ్ణి కోహ్లీ ప్రదర్శించలేదు. కోహ్లీ ఉన్న సమయంలో సహచరులెవ్వరూ మగతగా ఉండేవాళ్లు కాదు. పోరాడి గెలవాలన్న కోహ్లీ పట్టుదల అనిర్వచనీయం. ఈ క్రమంలో కొన్నిసార్లు కోహ్లీ సహచరులపై ఒత్తిడి తెచ్చేవాడు. సౌతాఫ్రికా పర్యటనలో చెటేశ్వర్ పుజారా ఉదంతం ఇందుకు ఉదాహరణ. వేగంగా రన్స్ తీసే క్రమంలో రనౌట్ కూడా అయ్యాడు. మైదానంలో కోహ్లీ ఉన్నడంటే ఒత్తిడి తప్పకుండా ఉంటుంది. తన కెప్టెన్సీలో మగత అనే పదానికి చోటు లేదు.



కొంత మంది భారత బ్యాట్స్‌మెన్ కోహ్లీ సంప్రదాయాన్ని అలవరచుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. నవతరం బ్యాట్స్‌మెన్ మయాంక్ అగర్వాల్, పృథ్వీ షాలను చూస్తే ఇదే అనిపిస్తుంది. కోహ్లీ నేతృత్వంలో భారత బౌలర్లు ఫుల్ లెంగ్త్ బౌలింగ్ చేస్తున్నారు. స్వీయ ఆత్మ విశ్వాసానికి ఇది నిదర్శనంగా చెప్పవచ్చు. గత కొన్నేళ్లుగా విదేశాల్లో భారత బౌలర్లు ఫుల్ లెంగ్త్ బాల్స్ వేసేందుకు భయపడేవారు. ఎందుకంటే ఆ బంతికి ఫోరో, సిక్సరో కొడతారని భయం.

ప్రస్తుత టీమిండియా ఆటగాళ్లు గతంలో మాదిరిగా మైదానంలో తోలు బొమ్మల్లా కదలడం లేదు. తమ కెప్టెన్ విరాట్ కోహ్లీకి ఉన్నంత స్పష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు. వాళ్లకు మరో మార్గం లేదు మరి. అందుకే టీమిండియా సిరీస్ తర్వాత సిరీస్‌లో ప్రతిభను మెరుగు పరచుకుంటూ దూసుకెళుతోంది. ఏడు దశాబ్దాలుగా ఏ టీమిండియా సాధించని రికార్డు కోహ్లీ నేతృత్వంలోని జట్టు సాధించింది. టీ20 సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-1తో, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 2-1తో గెలిచి ప్రపంచ క్రికెట్‌లో తమకు ఎదురునిలిచే వారే లేరన్న కంగారూల గర్వాన్ని అణిచింది. అంతేకాదు ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్‌ను గెలవడంతో పాటు తొలి ద్వైపాక్షిక సిరీస్‌ను సొంతం చేసుకున్న తొలి కెప్టెన్‌గా కోహ్లీ రికార్డు ల్లోకెక్కాడు. ఎదురు లేని మనిషిగా దూసుకెళ్తున్నాడు.

సెమీస్‌లో సౌరాష్ట్ర

- రంజీ ట్రోఫీలో రికార్డు చేజింగ్
- 6 వికెట్లతో ఉత్తరప్రదేశ్‌పై గెలుపు

లక్నో: రంజీ ట్రోఫీలో భాగంగా జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు ఆరు వికెట్లతో విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. గత మంగళవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 385 పరుగులకు ఆలౌటవ్వగా... సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 208 పరుగుకే కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ జట్టు 194 పరుగుకే ఆలౌటైంది. దీంతో సౌరాష్ట్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 372 పరుగులు చేయాల్సి వచ్చింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌరాష్ట్ర జట్టుకు ఓపెనర్లు దేశాయ్ (116) సెంచరీతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. దేశాయ్‌కు తోడుగా పటేల్ (72), పుజారా (67 నాటౌట్), జాక్సన్ (73 నాటౌట్) అర్ధ శతకాలు చేశారు. దీంతో సౌరాష్ట్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు కోల్పోయి రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసిన హార్విక్ దేశాయ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్: 385 ఆలౌట్, రెండో ఇన్నింగ్స్: 194 ఆలౌట్.

సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్: 208 ఆలౌట్, రెండో ఇన్నింగ్స్ 372/4.

ధోనీతో ఆడటం చాలా సంతోషంగా ఉంది

- టీమిండియా క్రికెటర్ కేదార్ జాదవ్



హైదరాబాద్: మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన మూడో వన్డేలో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో మూడు వన్డేల సిరీస్‌ని 2-1తో చేజిక్కించుకుంది. అంతేకాదు ఆస్ట్రేలియా గడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెలవడం భారత్‌కు ఇదే తొలిసారి. మహేంద్రసింగ్ ధోని (87 నాటౌట్), కేదార్ జాదవ్ (61 నాటౌట్) అజేయ అర్ధశతకాలు బాదడంతో 231 పరుగుల లక్ష్యాన్ని భారత్ మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఛేదించిన సంగతి తెలిసిందే. ధోనితో పాటు క్రీజులో ఉండటం తనకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని టీమిండియా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ కేదార్ జాదవ్ పేర్కొన్నాడు. మ్యాచ్ అనంతరం చాహల్‌తో కలిసి బీసీసీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కేదార్ జాదవ్ మాట్లాడుతూ 'ఆస్ట్రేలియాలో ఇదే నా తొలి మ్యాచ్. మరొకవైపు సిరీస్‌లో చివరి మ్యాచ్ కావడంతో క్రీజులో ఎక్కువసేపు ఉండేందుకు నిశ్చయించుకున్నాను. స్ట్రైక్ రొటేట్ చేస్తూ చివరివరకూ క్రీజులో ఉంటే టార్గెట్ చేరుకుంటామని అనుకున్నా' అని అన్నాడు. 'మరో ఎండ్‌లో ధోని ఉండడంతో నా ఆలోచనలకు బలం చేకూరింది. బ్యాటింగ్ చేసే క్రమంలో నా సందేహాలను ధోని వద్ద నివృత్తి చేసుకునేవాడిని. ధోని మరో ఎండ్‌లో ఉన్నప్పుడు బ్యాటింగ్ చేయడం సులభంగా ఉంటుంది. క్రీజులో ధోని ఉన్నప్పుడు ఎదురుగా ఉన్న బౌలర్ అంచనాలతో పాటు ధోని ఆలోచనలను కూడా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అతను క్రీజులో ఉంటే కొండంత బలం' అని జాదవ్ చెప్పాడు.

'బాల్ తీసుకో..'

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఎంఎస్ ధోనీ మూడు అర్ధ శతకాలు బాది భారత్ సిరీస్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. గత సంవత్సరం పరుగులు చేయలేకపోయిన ధోనీ.. ఈ ఏడాదిలో వరుసగా



మూడు వన్డేల్లో మూడు అర్ధ శతకాలు బాది విమర్శకుల నోళ్లు మూయించాడు. అయితే శుక్రవారం మెల్‌బోర్న్ వేదికగా ముగిసిన మూడో వన్డే అనంతరం ధోనీ మ్యాచ్ బాల్‌ను తీసుకున్నాడు. 2018లో ఇంగ్లాండ్‌తో వన్డే ముగిశాక ధోనీ మ్యాచ్ బాల్‌ను తీసుకోవడంతో.. రిటైర్మెంట్ రూమర్లు వచ్చాయి. అది గుర్తుకు రావడంతో.. మ్యాచ్ బాల్‌ను కోచ్ సంజయ్ బంగర్‌కు అందించాడు. 'బాల్ తీసుకో.. లేదంటే నేను రిటైరవుతున్నా అంటారేమో' అని బంగర్‌తో ధోనీ సరదాగా వ్యాఖ్యానించాడు.

పాండ్య, రాహుల్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- సీఓఏని కోరిన బీసీసీఐ అధ్యక్షుడు సీకే ఖన్నా

న్యూఢిల్లీ: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, క్రికెటర్ రాహుల్‌లపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని బీసీసీఐ అధ్యక్షుడు సీకే ఖన్నా పాలకుల కమిటీకి లేఖ రాశారు. పాండ్య, రాహుల్ వివాదంపై పదిరోజుల్లో ప్రత్యేక జనరల్ సమావేశం జరపడానికి ఆయన నిరాకరించారు. 'సుప్రీం కోర్టు ఈ వివాదాన్ని స్వీకరించి అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేసేవరకు ఈ విషయంలో ఎలాంటి సమావేశాలు జరపలేం. పాండ్య, రాహుల్ పొరపాటు చేశారు.వారిద్దరినీ ఇప్పటికే సస్పెండ్ చేశారు. దీనిపై వారు క్షమాపణలు కూడా కోరారు. విచారణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ వారిద్దరినీ ఇండియన్ జట్టులోకి తీసుకోవాలి. దీంతోపాటు మరికొన్ని రోజుల్లో న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లకూ వారిని అనుమతించాలి' అంటూ పాలకుల కమిటీ ఉన్నతాధికారులకు ఖన్నా లేఖ రాశారు.



కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న షోలో పాండ్య, రాహుల్ చేసిన వ్యాఖ్యలపై వీరిద్దరినీ సస్పెండ్ చేశారు. ఈ కారణంగా ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు ఇద్దరూ దూరమయ్యారు. అయితే ఈ ఇద్దరి భవితవ్యాన్ని తేల్చడానికి అంబుడ్స్‌మెన్‌ను నియమించాలంటూ పాలకుల కమిటీ సుప్రీం కోర్టును కోరింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.